ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
చిత్తూరు
జిల్లా వార్తలు
మంగళవారం 17 సెప్టెంబరు 2024



సోమవారోత్సవం.. పోటెత్తిన భక్తజనం


ప్రాకారోత్సవంలో వళ్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి


వీపుతేర్లు చెల్లించేందుకు వస్తున్న భక్తులు

రామకుప్పం పట్టణ శివార్లలోని వళ్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి ఆలయంలో రెండో సోమవారోత్సవానికి భారీగా భక్తులు తరలివచ్చారు. తెల్లబారుజామున స్వామివారికి ప్రత్యేక అభిషేక పూజలు నిర్వహించి విశేష అలంకరణ చేశారు. పలమనేరు, కుప్పం నియోజకవర్గాల నుంచే కాకుండా కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాలనుంచి పెద్దసంఖ్యలో భక్తులు క్యూలైన్లలో బారులుతీరి దర్శనం చేసుకున్నారు. వివిధ రోగాల బాధితులు వెండితో చేసిన కళ్ళు, చెవులు, నాగపడిగలు స్వామి వారిలో హుండీలో వేసి మొక్కులు తీర్చుకున్నారు. మహిళలు నాగులపుట్టలో పాలు, పండ్లు సమర్పించారు. పలువురు దంపతులు సంతాన ప్రాప్తి కోసం అక్కడి రావి వృక్షాలకు జోలెలు కట్టారు. పలువురు భక్తులు వీపునకు కొక్కీలు తగిలించుకుని తేర్లు లాగుతూ, దవడలకు శూలాలు, ఇంటిపై నిమ్మకాయలు గుచ్చుకుని, కావళ్లతో వచ్చి మొక్కులు చెల్లించారు. నాగులమ్మ, శనీశ్వరస్వామి, పద్మావతి, వేంకటేశ్వరస్వామి ఆలయాలు కూడా భక్తులతో కిటకిటలాడాయి. సీఐ మల్లేష్‌యాదవ్, ఎస్ఐలు నరేష్, శ్రీనివాసులు భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా బందోబస్తు నిర్వహించారు.

\- రామకుప్పం


ఆలయం వద్ద భక్తుల కోలాహలం


నాగులపుట్ట వద్ద పూజల్లో భక్తులు

ఎట్టకేలకూ రేషన్ పంపిణీ

డీలర్ వద్ద 29.61క్వింటాళ్ల బియ్యం స్టాక్ తేడా

గత నెల రేషన్ బియ్యం ఇక లేనట్లే


చౌకదుకాణాన్ని తనిఖీ చేస్తున్న తహసీల్దార్ రాము

పుంగనూరు, సెప్టెంబరు 16 :పుంగనూరు పట్టణ పరిధిలోని 18వ రేషన్ షాపులో కార్డుదారులకు ఈ నెల కోటా బియ్యం రెవెన్యూ అధికారుల ద్వారా సోమవారం పంపిణీ జరిగింది. రెండు నెలలుగా అందని రేషన్ శీర్షికతో ఆంధ్రజ్యోతిలో ఆదివారం కథనం ప్రచురితం కావడంతో కలెక్టర్ సుమిత్‌కుమార్, పలమనేరు ఆర్డీవో మనోజ్‌కుమార్‌రెడ్డి స్పందించి విచారణకు ఆదేశించారు. కార్డుదారులకు ఇబ్బంది లేకుండా వీఆర్వో జానకిరామ్‌ను బియ్యం పంపిణీ చేయాలని తహసీల్దార్ రాము ఆదేశించారు. స్థానిక ఈస్ట్‌పేటలోని రేషన్‌షాపును అధికారులు తెరిపించగా స్టాక్ కనిపించలేదు. స్టాక్ ఏమైందని ప్రశ్నించడంతో డీలర్ బయట నుంచి కొంత బియ్యాన్ని తెప్పించి కార్డుదారులకు పంపిణీ చేశారు. ఆగస్టు కోటా కార్డుదారులకు ఇవ్వలేదు. ఈ నెల కోటా కూడా ఇంకా చాలామందికి ఇవ్వాల్సి వుంది.కార్డుదారులతో పాటు ఎంయూడీ వాహనదారుడు, రేషన్‌షాప్ డీలర్ల నుంచి తహసీల్దార్ రాము, డీటీ తాసీనా, వీఆర్వో జానకీరామ్ వివరణ రికార్డు చేశారు. తమకు గత నెల బియ్యం ఇవ్వలేదని కార్డుదారులు పేర్కొన్నారు. కలెక్టర్, జేసీ, ఆర్డీవోలకు విచారణ నివేదిక పంపుతున్నట్లు తహసీల్దార్ రాము తెలిపారు. డీలర్‌పై చర్య తీసుకోవాలని, తనిఖీలలో 29.61క్వింటాల్ బియ్యం తక్కువ ఉందని, వీఆర్వో ద్వారా పంపిణీకి అనుమతి ఇవ్వాల్సిందిగా నివేదిక పంపుతున్నట్లు తెలిపారు. రేషన్ డీలర్ ఆగస్టు, సెప్టెంబరు నెలలకు సంబంధించి కార్డుదారులకు కేటాయించిన స్టాక్ మొత్తం గోడౌన్ నుంచి షాపునకు తరలించినట్లు అధికారుల విచారణలో వెల్లడయింది.

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్


దుకాణంలో నిల్వ ఉన్న సరుకులు

వైభవంగా త్రిశూల స్నానం

ధ్వజావరోహణంతో ముగిసిన కాణిపాక బ్రహ్మోత్సవాలు


పుష్కరిణిలో త్రిశూల స్నానం

ఐరాల(కాణిపాకం), సెప్టెంబరు 16: కాణిపాక వరసిద్ధుడి ఆలయ బ్రహ్మోత్సవాల్లో సోమవారం పుష్కరిణి వద్ద త్రిశూల స్నానాన్ని వైభవంగా నిర్వహించారు. బ్రహ్మోత్సవ సమయంలో స్వామివారికి రక్షగా యాగశాలలో త్రిశూలాన్ని ఉంచుతారు. రోజూ ఉదయం పురవీధుల్లో టింగ్‌టింగ్ పిళ్లారప్పగా(నప్పరం) త్రిశూలాన్ని ఊరేగిస్తారు. ఈ త్రిశూలాన్ని,యాగశాలలో 108 మట్టికుండల్లో ఉంచిన నవ ధాన్యాలను సోమవారం పుష్కరిణి వద్దకు తీసుకొచ్చి పూజలు నిర్వహించారు.అనంతరం త్రిశూలాన్ని,నవధాన్యాలను పుష్కరిణిలోనే నిమజ్జనం చేశారు. బ్రహ్మోత్సవాల పనులతో అలసిపోయిన ఆలయ అధికారులు, సిబ్బంది సోమవారం ఆట విడుపుగా వసంతోత్సవాన్ని నిర్వహించారు. చిన్నా,పెద్ద వ్యత్యాసం లేకుండా అందరు రంగులు చల్లుకున్నారు. వీరితో పాటు యాత్రికులు కూడా వసంతోత్సవంలో పాల్గొన్నారు.బ్రహ్మోత్సవాల ముగింపు సందర్భంగా సోమవారం రాత్రి ధ్వజావరోహణ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఆలయంలోని ధ్వజస్తంభంపై ఉన్న మూషిక ధ్వజపటాన్ని మేళ,తాళాలు,వేద మంత్రోచ్ఛారణ నడుమ కిందకు దించారు.అనంతరం వడాయత్తు ఉత్సవాన్ని నిర్వహించారు. కాకర్లవారిపల్లెకు చెందిన గాలి ఉమాపతినాయుడు జ్ఞాపకార్థం ఆయన కుమార్తె సుజాత ఉభయదారుగా వ్యవహరించారు. ఈ సందర్భంగా స్వామి వారికి అభిషేకం చేశాక వడలతో తయారు చేసిన మాలను ధరింపజేశారు.పెసరపప్పు పాయసాన్ని నైవేద్యంగా సమర్పించారు.అనంతరం స్వామివారికి ఏకాంత సేవను నిర్వహించారు.కె.సోమశేఖర్‌రెడ్డి జ్ఞాపకార్థం ఆయన కుమారులు ఉభయదారులుగా వ్యవహరించారు.ఈ సందర్భంగా సిద్ధి, బుద్ధి సమేత వరసిద్ధి వినాయకస్వామి ఉత్సవర్లకు ధూప, దీప నైవేద్యాలు సమర్పించి అలంకార మండపంలో ఉంచి చప్పుడు చేయకుండా అధికారులు, అర్చకులు, సిబ్బంది వెనుదిరిగారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా ఈవో గురుప్రసాద్‌కు,ప్రధాన అర్చకుడు సోమశేఖర్ గురుకుల్‌కు కట్టిన కంకణాలను అర్చకులు తొలగించారు.అనంతరం ఈవోను గజమాలతో సత్కరించి ఆలయ మర్యాదలతో కార్యాలయ భవనానికి తీసుకెళ్లారు. ఎమ్మెల్యే మురళిమోహన్, ఏఈవోలు విద్యాసాగర్‌రెడ్డి, ఎస్వీ కృష్ణారెడ్డి, సూపరింటెండెంట్లు కోదండపాణి, శ్రీధర్‌బాబు, ఇన్‌స్పెక్టర్లు విష్ణుశ్వరవి పాల్గొన్నారు.

నేటినుంచి ప్రత్యేక ఉత్సవాలు

కాణిపాకంలో మంగళవారం నుంచి 11 రోజుల పాటు ప్రత్యేక ఉత్సవాలను నిర్వహించనున్నారు.మంగళవారం స్వామివారికి అధికారనంది వాహన సేవను నిర్వహించనున్నారు.కాణిపాకానికి చెందిన వళ్లువర్ వంశస్థులు ఉభయదారులుగా వ్యవహరించనున్నారు.18న రావణబ్రహ్మ, 19న యాళి వాహన సేవలను నిర్వహిస్తారు. 20న విమానోత్సవం. 21న పుష్పపల్లకి సేవ జరుగుతాయి.22న కామధేను, 23న సూర్యప్రభ , 24న చంద్రప్రభ,25న కల్పవృక్ష వాహన సేవలను నిర్వహిస్తారు. 26న పూలంగి సేవ, 27న తెప్పోత్సవంతో ఈ ఉత్సవాలు ముగుస్తాయి.


ధ్వజపటాన్ని దించి హారతి


ఏకాంత సేవలో వినాయక స్వామికి నక్షత్ర హారతి

పుంగనూరులో హైటెన్షన్

ఎంపీ మిథున్‌రెడ్డి పర్యటన ప్రశాంతం


మదనపల్లె రోడ్డులో భారీగా మోహరించిన పోలీస్ బలగాలు

పుంగనూరు, సెప్టెంబరు 16: పుంగనూరులో సోమవారం ఎంపీ మిథున్‌రెడ్డి పర్యటన సందర్భంగా ఉద్రిక్త వాతావరణం నెలకొంది. పట్టణంలో ఎక్కడ చూసినా పోలీసు బలగాలు, బారికేడ్లు, లాఠీలు, పోలీస్ సేఫ్టీ హెల్మెట్లు, గార్డులతో కనిపించడంతో ఏమి జరుగుతోందో అని ప్రజల్లో ఉత్కంఠ నెలకొంది. ద్విచక్ర వాహనాలు, కార్లు, ఇతర అన్ని వాహనాలను పోలీసులు తనిఖీ చేశారు. కొన్నింటిని అడ్డుకున్నారు. మిథున్‌రెడ్డి రాకతో గొడవలు జరుగుతాయని ముందు జాగ్రత్తగా పోలీసు బందోబస్తు, పికెట్లు ఏర్పాటు చేశారు. ఎన్నికల తర్వాత ఎంపీ మిధున్ రెడ్డినీ, ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రా రెడ్డినీ నియోజకవర్గంలోకి రానివ్వకుండా కూటమి పార్టీల శ్రేణులు అడ్డుకుంటూనే ఉన్నాయి. రాళ్ల దాడులు, వాహనాల విధ్వంసం వంటి సంఘటనలు కూడా చోటు చేసుకున్నాయి. దీంతో ముందుజాగ్రత్తగా చిత్తూరు ఎస్పీ మణికంఠ చందోల్ సోమవారం పుంగనూరులో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.డీఎస్పీలు ప్రభాకర్,మహబూబ్‌బాషా, పుంగనూరు, చౌడేపల్లె, గంగవరం, బంగారుపాళ్యం సీఐలు శ్రీనివాసులు, రాంభూపాల్, మురళీమోహన్, ప్రసాద్, శ్రీనివాసులు, జయరామ్ తదితరులు స్థానిక చౌడేపల్లె రోడ్డులోని యూఎస్ఆర్ సర్కిల్, శ్రీకృష్ణదేవరాయల సర్కిల్, అంబేద్కర్ సర్కిల్, ఎ.కొత్తకోట సర్కిల్, గోకుల్ సర్కిల్, మున్సిపల్ బస్టాండ్, మున్సిపల్ కార్యాలయం, ఆర్టీసీ సర్కిల్, పోలీస్‌లైన్ తదితర ప్రాంతాల్లో చెక్‌పోస్టులు, పికెట్లు వాహనాల తనిఖీలతో బందోబస్తు నిర్వహించారు. బయట ప్రాంతాల నుంచి వాహనాల్లో వైసీపీ నేతలు పుంగనూరుకు వస్తే గొడవలు జరిగే అవకాశముందని, పరిమిత సంఖ్యలోనే వాహనాలను అనుమతించారు. ఎంపీ మిథున్‌రెడ్డిని, మాజీ ఎంపీ రెడ్డెప్పను ఇందుకు సహకరించాలని పోలీసులు కోరారు. మున్సిపల్ కార్యాలయంలోకి మొదట్లో పోలీసులు కేవలం కౌన్సిలర్లను మాత్రమే అనుమతించి తనిఖీలు నిర్వహించారు. ఎంపీతోపాటు వైసీపీ నాయకులు, కార్యకర్తలు కార్యాలయంలోకి వెళ్లారు. అలాగే వైసీపీ శ్రేణుల ఇళ్లకు వెళ్లి ఎంపీ మాట్లాడారు. మొత్తం మీద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరకుండా సోమవారం ఎంపీ మిథున్ కార్యక్రమం సాఫీగా జరిగింది.ఏదైనా చిన్న సంఘటన జరిగినా తద్వారా ఎంపీ మిథున్‌రెడ్డి పోలీసు భద్రత పెంచుకోవడానికి పథకం రచించారని అధికార పార్టీ నాయులు భావించి ఎంపీ పర్యటన గురించి పట్టించుకోలేదు. నాయకులను పట్టణ సమీపంలోని వైసీపీ నేత గెస్ట్‌హౌస్‌కు ఎంపీ పిలిపించి అండగా ఉంటానని భరోసా ఇచ్చారు.

ఫలించని మిథున్ వ్యూహం

పర్యటన గురించి పట్టించుకోని టీడీపీ శ్రేణులు


పుంగనూరులో మీడియాతో మాట్లాడుతున్న మిథున్‌రెడ్డి

చిత్తూరు, సెప్టెంబరు16(ఆంధ్రజ్యోతి): వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు పుంగనూరులో ప్రతిపక్షాలపై నిత్యం దాడులు, దౌర్జన్యాలు జరిగేవి. అధికారం కోల్పోయాక నియోజకవర్గంలో వైసీపీ క్యాడర్ ధైర్యం కోల్పోకుండా, తమ ఉనికి కాపాడుకునేందుకు మిథున్, పెద్దిరెడ్డి గట్టిగా ప్రయత్నిస్తున్నారు. ఒందులో భాగంగానే సోమవారం పుంగనూరులో మిథున్ ఓ నాయకుడి ఇంటికి వెళ్లి పరామర్శించారు.మున్సిపల్ కార్యాలయంలో శ్రేణులతో సమావేశమై తమకింకా పట్టుందని సంకేతాలిస్తున్నారు.

సెక్యూరిటీ పెంచుకోవడానికేనా?

మాజీ ఎంపీ రెడ్డప్ప ఇంటి వద్ద లైలో జరిగిన ఘర్షణను అడ్డుపెట్టుకుని, మిథున్ తనకు సెక్యూరిటీ పెంచాలని హైకోర్టును ఆశ్రయించారు. ఇప్పటికే 2 ప్లస్ 2 ఉందని, పెంచాల్సిన అవసరం లేదని చిత్తూరు పోలీసులు కోర్టుకు బదులిచ్చారు. దీంతో లోక్‌సభ స్పీకర్ ద్వారా కేంద్రానికి విన్నవించుకుని.. 4 ప్లస్ 4 సీఆర్‌పీఎఫ్ బలగాలను తాత్కాలిక భద్రతగా తెచ్చుకున్నారు. పుంగనూరులో మరోసారి పర్యటించి, ప్రభుత్వ కార్యాలయాల్లో సమీక్షలు పెడితే టీడీపీ శ్రేణులు అడ్డుకుని దాడికి పాల్పడుతారని , దాన్ని చూపించి సెక్యూరిటీ పెంచుకోవచ్చని భావించిన మిథున్ ఆశలు ఫలించలేదన్న వ్యాఖ్యలు విన్పిస్తున్నాయి. మిథున్ వ్యూహాలను పసిగట్టిన టీడీపీ సంయమనం పాటించాలనినిర్ణయించుకుంది.ఆయన పర్యటనను పట్టించుకోనట్టు వుండిపోయింది. అధికారంలో లేకపోయినా నియోజకవర్గంలో నిత్యం పర్యటిస్తున్నానని చెప్పేందుకు కూడా మిథున్ తంటాలు పడుతున్నారు. 'ప్రజల నుంచి అర్జీలు తీసుకునేందుకు' పేరుతో మంగళవారం చౌడేపల్లె ఎంపీడీవో కార్యాలయంలో సమావేశాన్ని ఏర్పాటు చేశారు.ఉనికి కోసమే మిథున్ ఆ పేరుతో చౌడేపల్లెలో పర్యటించనున్నట్లు చెబుతున్నారు.

తిరుమలలో పెరిగిన రద్దీ

శ్రీవారి దర్శనానికి 20 గంటలు


అలిపిరి చెక్ పాయింట్ వద్ద వాహనాల రద్దీ

తిరుమల, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): వరుస సెలవుల నేపథ్యంలో తిరుమలలో రద్దీ నెలకొంది. శ్రీవారి సర్వదర్శనానికి 20 గంటల సమయం పడుతోంది. శ్రీవారి ఆలయంతో పాటు మాడవీధులు, అఖిలాండం, అన్నప్రసాద కేంద్రం, లడ్డూ కేంద్రం వంటి ప్రాంతాల్లో భక్తుల సందడి నెలకొంది. సర్వదర్శనం కోసం భక్తులు వైకుంఠం క్యూకాంప్లెక్స్‌లోని కంపార్టుమెంట్లు, నారాయణగిరిలోని షెడ్లలో నిండిపోయారు. క్యూలైన్ టీబీసీ వరకు వ్యాపించింది. వీరికి 20 గంటల దర్శనం పడుతోంది. తలనీలాలు సమర్పించే కల్యాణకట్టలు, గదులు కేటాయించే కౌంటర్లు కూడా రద్దీనే కనిపించాయి. స్లాటెడ్ దర్శనాలు కలిగిన భక్తులకూ రెండు నుంచి మూడు గంటల దర్శన సమయం పడుతోంది. మరోవైపు తనిఖీల నేపథ్యంలో సోమవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు అలిపిరి చెక్ పాయింట్ వద్ద వాహనాలు భారీగా నిలిచిపోయాయి.

కొండపై అనధికార తట్టల తొలగింపు

తిరుమలలో పలు ప్రాంతాల్లో వెలసిన అనధికార తట్టలను సోమవారం అధికారులు తొలగించారు. గత వైసీపీ ప్రభుత్వంలో నాయకుల అండదండలతో తిరుమలలో రద్దీ అధికంగా ఉండే ప్రాంతాల్లో అనధికార తట్టలు వెలసిన విషయం తెలిసిందే. తాజాగా కూటమి నేతల సహకారంతోనూ పలువురు తట్టలు ఏర్పాటు చేశారు. శ్రీవారి ఆలయం ముందున్న అఖిలాండం వద్ద, డీఎంబీ రోడ్డు, పాత అన్నదానం, వరాహస్వామి విశ్రాంతి భవనం వద్ద దాదాపు 13కు పైగా దుకాణాలు ఏర్పాటు చేశారు. దీనిపై అధికారికంగా టీటీడీ నుంచి లైసెన్స్‌లు పొంది అద్దె కడుతున్న వ్యాపారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పైగా మీడియాలో విమర్శలు రావడంతో సోమవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు టీటీడీ టాస్క్‌ఫోర్స్ అధికారులు అక్రమంగా పెట్టిన దుకాణాలను తొలగించారు. మరోసారి ఏర్పాటు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఏఐఎఫ్‌టీవో కార్యదర్శిగా గిరిప్రసాద్



చిత్తూరు (సెంట్రల్), సెప్టెంబరు 16: ఆలిండియా ఫెడరేషన్ ఆఫ్ టీచర్స్ ఆర్గనైజేషన్ (ఏఐఎఫ్‌టీవో) కార్యదర్శిగా ఏఎం గిరిప్రసాద్ ఎన్నికయ్యారు. సోమవారం లక్నోలో ఏఐఎఫ్‌టీవో జాతీయ స్థాయి టీచర్ల సమావేశం నిర్వహించింది. విద్యారంగం, టీచర్ల సమస్యలు, వాటి పరిష్కారాలపై చర్చలు జరిగాయి. అనంతరం నూతన కార్యవర్గ ఎన్నికలో జిల్లాకు చెందిన పీఆర్‌టీయూ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఏఎం గిరిప్రసాద్‌ను జాతీయ స్థాయి కార్యదర్శి స్థానానికి ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. దీనిపై పలువురు పీఆర్‌టీయూ రాష్ట్ర నాయకులు హర్షం వ్యక్తం చేసి, అభినందనలు తెలిపారు.

బస్సులో బంగారం చోరీ



విచారిస్తున్న పోలీసులు (ఇన్‌సెట్లో) బాధితురాలు

చిత్తూరు, సెప్టెంబరు 16: బస్సులో ఓ మహిళ బ్యాగులో ఉన్న బంగారం చోరీ అయిన సంఘటన సోమవారం ఆర్టీసీ బస్టాండు వద్ద జరిగింది. బాధితులు తెలిపిన వివరాల మేరకు.. తిరుపతికి చెందిన ప్రేమ అనే మహిళ కుటుంబం బెంగళూరులో స్థిరపడింది. రెండ్రోజుల కిందట తిరుపతిలో పెళ్లి ఉండటంతో కుటుంబంతో కలిసి వచ్చారు. పెళ్లి చూసుకుని సోమవారం సాయంత్రం కర్ణాటక ఆర్టీసీ బస్సులో బెంగళూరుకు బయల్దేరారు. బస్సు చిత్తూరుకొచ్చాక బంగారు నగలున్న బ్యాగు కనడపడలేదు. దీంతో ఆమె చుట్టుపక్కల ఉన్న వారిని అడిగినా ఫలితం లేదు. అప్పటికే బస్సు చిత్తూరు ఒకటో పట్టణ పోలీసుస్టేషన్ వద్దకు చేరింది. ఈ విషయాన్ని పోలీసులకు బాధితులు చెప్పారు. పోలీసులు కూడా ప్రయాణికులను తనిఖీ చేశారు. వారి వద్ద బ్యాగు లేకపోవడంతో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి దొంగల కోసం గాలిస్తున్నారు. కాగా.. గిల్ట్ నగలున్న బ్యాగు మాత్రమే తమ ఉందని బాధితులు చెబుతున్నారు. దీంతో బంగారం నగలను మర్చిపోయి తిరుపతిలోనే వదిలేశారా లేదా మరెక్కడైనా పెట్టేశారా చూడాలని పోలీసులు చెప్పడంతో బాధితులు ఫిర్యాదు ఇవ్వకుండానే వెళ్లిపోయారు.

డయాలసిస్ సెంటరు లేక రోగుల అవస్థలు



పలమనేరులోని వంద పడకల ఆసుపత్రి నూతన భవనం

పలమనేరు, సెప్టెంబరు16 : నియోజకవర్గ కేంద్రంలో డయాలసిస్ సెంటరు ఏర్పాటు చేయాలని పలువురు కిడ్నీ వ్యాధి బాధితులు కోరుతున్నారు. నియోజకవర్గ పరిధిలో పలమనేరు, గంగవరం, బైరెడ్డిపల్లి, పెద్దపంజాణి మండలాలతోపాటు స్థానిక మున్సిపాలిటీలో ఆ బాధితులు ఎక్కువ మంది ఉన్నారు. వీరిలో కొందరు వారానికి ఒకసారి, మరికొందరు రెండుపర్యాయాలు, మరికొందరు మూడు పర్యాయాలు డయాలసిస్ చేసుకుంటున్నారు. ప్రస్తుతం కోలారు, బెంగళూరు, తిరుపతి, కుప్పం పీఈఎస్ మెడికల్ కళాశాలలకు వెళ్లాల్సి వస్తోంది. ఒకసారి ప్రయివేటు ఆసుపత్రుల్లో డయాలసిస్ చేసుకోవాలంటే కనీసం రూ.3వేల నుంచి రూ.4500 వరకూ వ్యయం అవుతోంది. ఇంత పెద్ద మొత్తంలో ఖర్చు చేయకోలేక చాలా మంది అప్పుల పాలవుతున్నారు. డయాలసిస్ సెంటరులో ఏమాత్రం ఇబ్బంది ఎదురైనా పేషెంట్ ఆరోగ్యం మరింత క్షీణించి ప్రాణాలకు ముప్పు ఏర్పడుతుంది. నియోజకవర్గంలో దాదాపు 100 మందికి పైగా ఉన్న ఆర్‌ఎంపీ వైద్యులు మిడిమిడి జ్ఞానంతో రాసిచ్చే యాంటీబయోటిక్స్ కూడా రోగులను మరింత అనారోగ్యం బారిన పడేస్తోందనే విమర్శలున్నాయి. ఎంబీబీఎస్ వైద్యుల వద్దకు వెళ్లే ఆర్థిక స్తోమతు లేక పేదలు ఈ ఆర్‌ఎంపీలను ఆశ్రయిస్తున్నారు. వీరు అవసరమున్నా లేకున్నా ప్రైవేట్ వైద్యులు ఎక్కువగా మందులు రాస్తున్నారని కొందరు రోగులు ఆవేదన చెందుతున్నారు. అధికమందుల ప్రభావంతో కిడ్నీ వ్యాధులు పెరిగిపోతున్నాయని వాపోతున్నారు. తమ ఇబ్బందులను తొలగించేందుకు పలమనేరులో ప్రభుత్వం డయాలసిస్ కేంద్రం ఏర్పాటుచేయాలని వ్యాధిగ్రస్తులు కోరుతున్నారు. పలమనేరు వంద పడకల ఆసుపత్రి ఇందుకు అనువుగా ఉంటుందని సూచిస్తున్నారు.

నిశ్చితార్థ వేడుకల కోసం క్యూలైన్ల తొలగింపు

● పల్లికొండేశ్వరాలయంలో వైసీపీ నేత నిర్వాకం



ప్రదోష మండపం వద్ద కట్ చేసిన గ్రిల్ అడుగు భాగం

నాగలాపురం, సెప్టెంబరు 16 : సురుటుపల్లె పల్లికొండేశ్వరాలయంలో మాజీ ఛైర్మన్ ఏవీఎం బాలాజీరెడ్డి మరో నిర్వాకం వెలుగు చూసింది. ప్రదోష మండపంలో తన కుమార్తె నిశ్చితార్థ వేడుకలకు అడ్డుగా ఉందని దాతల సాయంతో ఏర్పాటు చేసిన క్యూలైన్లను కట్ చేసి తొలగించిన వైనం బయట పడింది. నాగలాపురం మండల పరిధిలోని సురుటు పల్లె పల్లికొండేశ్వరాలయంలో వున్న ప్రదోష మండపంలో ఆదివారం వైసీపీ నేత బాలాజీ రెడ్డి కుమార్తె నిశ్చితార్థ వేడుకలు జరిగిన విషయం తెలిసిందే. వచ్చిన బంధు మిత్రులను ఏకంగా కుర్చీలు వేసి కూర్చోబెట్టడం



తొలగించిన గ్రిల్‌ను మళ్లీ దారంతో కట్టిపెట్టిన దృశ్యం

విమర్శలపాలైంది. వేడుకలను వీక్షించేందుకు అడ్డుగా ఉందని ప్రదోష మండపం వద్ద భక్తుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన స్టీల్ క్యూలైన్లను కట్ చేసి తొలగించి వుండడం సోమవారం చూసినవాళ్లంతా నోరెళ్లబెట్టారు. ఆలయంలో జరిగే ప్రదోష పూజలకు, మహా శివరాత్రి వంటి విశేష రోజుల్లో భక్తుల రద్దీని కట్టడి చేసేందుకు నలుగురు దాతలందించిన సుమారు 15 లక్షల రూపాయలతో స్టీల్ గ్రిల్స్‌తో ఆలయంలో పలు చోట్ల క్యూలైన్లు ఏర్పాటు చేశారు. అటువంటి క్యూలైన్లను తొలగించడంపై భక్తులు మండిపడు తు న్నారు. ఆలయ సిబ్బంది క్యూలైన్‌ను కట్ చేయవద్దని అభ్యంతరం తెలిపినా కూడా తొలగించినట్లు సమాచారం. రాష్ట్రంలో ప్రభుత్వం మారి.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినా ఇంకా వైసీపీ నేతల హవా కొనసాగుతుం డడం, అధికారులు ఇంకా వారి చెప్పు చేతల్లోనే ఉన్నారనడానికి ఈ ఉదంతం ఓ నిదర్శనం. వైసీపీ ప్రభుత్వ హయాంలో బాలాజీరెడ్డి పల్లికొండేశ్వరాలయ ఛైర్మన్‌గా సంస్కరణల పేరుతో ఎన్నో అడ్డగోలు నిర్ణయాలు తీసుకోవడంపై అప్పట్లో వివాదాలు చెలరేగాయి. అయితే ఆయన పలుకుబడి కలిగిన నాయకుడు కావడంతో అధికారులు వారించే సాహసం చేయలేక పోయారు. అయితే ప్రభుత్వం మారినా ఆలయంలో ఆయన హవాయే ఇంకా కొనసాగుతుండడం ఆశ్చర్యకరం.

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో మార్పులు



మార్పులు చేశాక చిత్తూరు ఆర్వో కార్యాలయం

చిత్తూరు కలెక్టరేట్, సెప్టెంబరు 16: జిల్లాలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో మార్పులకు ప్రభుత్వం శ్రీకారంచుట్టింది. బ్రిటీష్‌కాలం నాటి పద్ధతులను రద్దు చేస్తున్నట్లు ఉత్తర్వులు ఇచ్చింది. సబ్ రిజిస్ట్రార్‌కి ప్రజలకు మధ్య టేబుల్ తప్ప మరేమీ అడ్డంకిగా ఉండకూడదని రెవెన్యూ, రిజిస్ట్రేషన్లశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్‌పీ సిసోడియా ఆదేశించారు. ఈమేరకు కార్యాలయాల్లో ఉండే ప్రత్యేక పోడియాన్ని తొలగించి, ప్రజలను గౌరవించాలని ప్రభుత్వం నిర్ణయించింది. అలాగే కార్యాలయానికి వచ్చేవారికి కుర్చీలు, తాగునీటితోపాటు అవకాశం ఉంటే టీ, కాఫీ సరఫరా చేయాలని ఆదేశాల్లో పేర్కొంది. సబ్ రిజిస్ట్రార్ కుర్చీని కూడా ఎత్తులో కాకుండా సాధారణ ఫ్లోరింగ్ ఎత్తులోనే ఉండేవిధంగా మార్పులు జరిగాయి. జిల్లాలోని చిత్తూరు ఆర్వో, కార్వేటినగరం, బంగారుపాళ్యం, పలమనేరు, నగరి, కుప్పం, పుంగనూరు, చిత్తూరు రూరల్ ప్రాంతాల్లో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు ఉన్నాయి. వీటిల్లో ప్రత్యేక పోడియాన్ని ఆదివారం తొలగించి.. ఒకే ఫ్లోర్‌లో కార్యాలయం ఉండేలా ఏర్పాట్లు చేపట్టారు. ఆదివారం సెలవైనప్పటికీ కార్యాలయానికి వచ్చిన సబ్ రిజిస్ట్రార్లు రాత్రి వరకు దగ్గరుండి పనులు చేయించారు. కొన్ని ఇంజనీరింగ్ పనులను సోమవారం పూర్తి చేశారు.

వి.కోట అల్లర్ల కేసుల్లో అరెస్టులకు రంగం సిద్ధం

● ఇప్పటి వరకు ఏడు కేసుల నమోదు



వి.కోట స్టేషన్ వద్ద ఆందోళనకు దిగిన నిందితుల బంధువులు (ఫైల్ ఫోటో)

వి.కోట, సెప్టెంబరు 16: వి.కోట అల్లర్ల సంఘటనకు సంబంధించి ఇప్పటివరకు నమోదైన ఏడు కేసుల్లో నిందితులను అరెస్టు చేసేందుకు పోలీసులు రంగం సిద్ధం చేశారు. ఈ నెల 2న జరిగిన ఘటనలపై ఇరు వర్గాల ఫిర్యాదుల మేరకు పోలీసులు కేసులు నమోదు చేసి ప్రధాన నిందితుడు ఆరిఫ్‌ను అరెస్టు చేసి రిమాడుకు తరలించారు. ఇటీవల గంగమ్మ గుడి వీధిలో ఇరు వర్గాల మధ్య జరిగిన ఘర్షణ అల్లర్లకు దారి తీసింది. డీఎస్పీ ప్రభాకర్ సహా ఎస్బీ పోలీసు ప్రకాష్‌తో పాటు ఓ విలేకరి గాయపడ్డారు. బాధితుల ఫిర్యాదుల మేరకు పోలీసులు వివిధ రకాల సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారు. ఘటనకు బాధ్యులైన నిందితుల కోసం పోలీసులు వెదుకుతున్నారు. అల్లర్లలో పాల్గొన్న వారందరిపై నిఘా ఉంచి నిందితులను గుర్తించారు. ఇరువర్గాలకు చెందిన సుమారు వంద మందిపై కేసులు నమోదయ్యాయి. మూడు రోజుల క్రితం నలుగురు అనుమానితులను పోలీసులు అదుపులోకి తీసుకోగా వారి బంధువులు పెద్ద సంఖ్యలో స్టేషన్ వద్దకు చేరుకున్నారు. కేసుల్లో లేని వారిని అరెస్టు చేశారని, తక్షణం విడిచి పెట్టాలంటూ ఆందోళనకు దిగారు. దీంతో పోలీసులు నలుగురికి సెక్షన్ 41 నోటీసులు ఇచ్చి పంపేశారు. ఏడు కేసులకు సంబంధించి ఓ నిందితుడు రిమాండులో ఉండగా, మిగిలిన కేసులో 20 మందిని అదుపులోకి తీసుకుని నోటీసులు ఇచ్చి సొంత పూచీకత్తుపై విడుదల చేశారు. ఈ కేసులో అరెస్టుల భయంతో ఇప్పటికే వందలాది మంది పొరుగు రాష్ట్రాలకు వెళ్లిపోయినట్లు తెలిసింది. పోలీసులు పలు బృందాలుగా అన్వేషిస్తున్నారు. జిల్లా ఎస్పీ మణికంఠ రోజూ ఈ కేసు పురోగతిపై సమీక్షిస్తున్నారు.

ఈ-పంట నమోదులో వేలిముద్రలే కీలకం

● 23కు గడువు పొడిగించిన ప్రభుత్వం



ఈ-పంట నమోదు చేస్తున్న జిల్లా వ్యవసాయ శాఖాధికారి మురళీకృష్ణ (ఫైల్ ఫొటో)

చిత్తూరు (సెంట్రల్), సెప్టెంబరు 16: జిల్లాలో ఖరీఫ్‌లో ఈ-పంట నమోదు పూర్తయినా వీఏఏ, వీఆర్వో, రైతుల వేలిముద్రలు వేయడం కీలకంగా మారింది. మరోవైపు ల్యాండ్ పార్సిల్ (ఎల్‌పీ) నెంబర్లు అడ్డంకిగా మారాయి. ఈ క్రమంలో రైతులు నష్టపోయే ప్రమాదం ఉంది. ఈ-పంట నమోదు ప్రక్రియ ఆదివారం నాటికి ముగిసినా, రైతుల ప్రయోజనార్థం కూటమి ప్రభుత్వం ఈ-పంట గడువును ఈనెల 23వ తేదీవరకు పెంచింది. జిల్లాలోని 1,10,603 మంది రైతులు 2,42,174 ఎకరాల్లో దాదాపు 23 రకాలైన పంటలు సాగు చేయాల్సి ఉండగా, 2,42,236 ఎకరాల్లో (100.03 శాతం) సాగు చేశారు. వీటికి సంబంధించిన ఈ-పంట నమోదు ప్రక్రియను వ్యవసాయ, రెవెన్యూ శాఖలు కలిపి చేయాలి.

పూర్తయ్యింది 72 శాతమే..

జిల్లాలో 73,649 మంది రైతులు 1,66,340 ఎకరాల్లో (72 శాతం) పూర్తి చేశారు. 36,954 మంది రైతులు 75,896 ఎకరాల్లో (28 శాతం) ఈ-పంట నమోదు మినహా, వీఏఏ, వీఆర్వో, రైతుల వేలిముద్రల ప్రక్రియ పూర్తి చేయాల్సి ఉంది.

ఎల్పీ నెంబర్లతో అడ్డంకి

పాత రెవెన్యూ జాబితా ప్రకారం రైతుల వారీగా సర్వే నంబర్లు ఉన్నాయి. భూ-రీ సర్వేలో చేపట్టిన గ్రామాల్లో సర్వేలో సర్వే నెంబర్లకు బదులుగా, ల్యాండ్ పార్సిల్ (ఎల్పీ) నెంబర్లు ఇచ్చారు. ఇది ఈ-పంట నమోదుకు పూర్తి అడ్డంకిగా మారింది. రైతు సేవా కేంద్రాల్లో ఎల్‌పీ నెంబర్లు డౌన్‌లోడ్ కావడం లేదు. రెవెన్యూ శాఖ ఎల్‌పీ నెంబర్లు డౌన్‌లోడ్ చేసి రైతు సేవా కేంద్రాలకు పంపితేనే వీఏఏలు ఈ-పంట నమోదు చేయగలుగుతారు. ఈ పరిస్థితుల్లో పెంచిన గడువులోగా అయినా పూర్తవుతుందో లేదో వేచి చూడాలి.

రెండు కిలోల గంజాయి స్వాధీనం: ఇద్దరి అరెస్టు

చిత్తూరు, సెప్టెంబరు 16: గంజాయి విక్రయించడానికి ప్రయత్నిస్తున్న ఇద్దరిని ఒకటో పట్టణ పోలీసులు పట్టుకున్నారు. వారి వద్ద నుంచి రెండు కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. సీఐ జయరామయ్య తెలిపిన వివరాల మేరకు.. చిత్తూరు ఏఆర్ టాప్‌లైన్‌లో గంజాయి విక్రయిస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. అక్కడికి చేరుకున్న పోలీసులు సంతపేటకు చెందిన అక్బర్(32), చామంతిపురానికి చెందిన రామ్మూర్తి (55)ని అదుపులో తీసుకున్నారు. తనిఖీ చేయగా వారి వద్ద 55,500 విలువైన రెండు కిలోల బరువున్న రెండు ప్యాకెట్లను గుర్తించి, స్వాధీనం చేసుకున్నారు. అనంతరం చిత్తూరు డిప్యూటీ తహసీల్దార్ ధనంజయులు సమక్షంలో నిందితులను, గంజాయిని ప్రవేశపెట్టిన అనంతరం అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించారు.

నేటినుంచి 15 రోజులపాటు స్వచ్ఛతా హీ సేవ

చిత్తూరు కలెక్టరేట్, సెప్టెంబరు 16: స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమాలు మంగళవారం నుంచి పక్షం రోజులపాటు జిల్లావ్యాప్తంగా నిర్వహించేందుకు యంత్రాంగం ఏర్పాట్లు చేపట్టింది. మంగళవారం యాదమరి సమీపంలోని మహాసముద్రం వద్ద బెంగళూరు - చెన్నై ఎక్స్‌ప్రెస్ హైవేలో మొక్కల పెంపకం డ్రైవ్ నిర్వహిస్తారు. ఇతర ప్రాంతాల్లో మానవహారం, పరిశుభ్రతపై మెగా డ్రైవ్, వైద్య ఆరోగ్య శాఖ ద్వారా ఆరోగ్య సంరక్షణ సేవలు నిర్వహిస్తారు. 18న స్వచ్ఛతా పరుగులు, బ్లీచింగ్, దోమల నివారణ మందుల పిచికారి, నీరు నిల్వే ప్రదేశాలను శుభ్రపరచడం, పారిశుధ్య కార్మికులకు ప్రథమ చికిత్స నిర్వహిస్తారు. 19న ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాసంస్థలు, బహిరంగ ప్రదేశాల్లో స్వచ్ఛతా ప్రతిజ్ఞలు, డంప్‌ల గుర్తింపు - తొలగింపు, పారిశుధ్య కార్మికులను గుర్తించి, వారికి మంజూరైన పథకాలతో అనుసంధానం చేస్తారు. 20న మొక్కల పెంపకం కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. 21న అవగాహన ప్రచారాలు, ర్యాలీలు, పరిశుభ్రత డ్రైవ్, పార్కులను శుభ్రపరచడం, నిర్వహణ, అభివృద్ధి, పీపీఈ కిట్లు, సేఫ్టీ గేర్లు పంపిణీ చేస్తారు. 22న మిషన్ లైఫ్ ప్రచారాలు, కాల్వలు శుభ్రపరచడం, పారిశుధ్య కార్మికులు, వారి కుటుంబాలకు ఆరోగ్య పరీక్షలు చేయిస్తారు. 23న వర్షపు నీటి నిల్వ నిర్మాణాల నిర్వహణపై అవగాహన, రహదారుల శుభ్రతా కార్యక్రమాలు చేపడతారు. 24న తాగు నీటి నిర్మాణాల పరిశుభ్రత, నిర్వహణపై అవగాహన ప్రచారం, నీటి నమూనా పరీక్షలు, వ్యక్తిగత రక్షణపై సఫాయిమిత్రలు, వారి కుటుంబాలకు అవగాహన ఉంటాయి. 25న వీధినాటకాలు, మార్కెట్ ప్రాంతాలను శుభ్రపరుస్తారు. 26న అవాంఛిత యాప్‌లను క్లియర్ చేయడం, సైబర్, డిజిటల్ స్వచ్ఛత, సంస్థాగత భవనాలు శుభ్రపరచడం, పిల్లల సంరక్షణ కార్యక్రమాలు చేపడతారు. 27న గ్రామ, వార్డు సభల నిర్వహణ, ప్రభుత్వ ఖాళీస్థలాల సుందరీకరణ, టూరిస్టు పాయింట్లు, వీధుల పరిశుభ్రత డ్రైవ్‌లు చేపడతారు. 28న సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ ఆస్తుల సుందరీకరణ పునర్వినియోగానికి పనికొచ్చే ఈ-వ్యర్థాల సేకరణ వంటి కార్యక్రమాలు చేపడతారు. 29న చెత్తను సృష్టించే ఆర్ట్ శానిటేషన్ పార్కులపై అవగాహన కార్యక్రమాలు చేస్తారు. 30న మూలాల విభజన, రీసైక్లింగ్ పద్ధతులు, కంపోస్టింగ్ ప్రదర్శనలు, కమ్యూనిటీ బేస్డ్ వేస్ట్‌మేనేజ్‌మెంట్ అవగాహన డ్రైవ్‌లు, ఆరోగ్య బీమా నమోదులో సహకారం వంటి కార్యకలాపాలు ఉంటాయి. అక్టోబరు 1న విద్యాసంస్థల్లో స్వచ్ఛ హాకథాన్ల నిర్వహణ, పబ్లిక్ టాయిలెట్స్ శుభ్రపరుస్తారు. చివరిరోజైన అక్టోబరు 2న శానిటేషన్ కార్మికులు, ఇతరుల గుర్తింపు, సన్మాన కార్యక్రమాలు చేపడతారు.

నేడు పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ

చిత్తూరు రూరల్, సెప్టెంబరు 16: ఆల్బెండజోల్ మాత్రలతో నులి పురుగులకు చెక్ పెట్టవచ్చునని జిల్లా టీబీ నివారణ అధికారి వెంకట ప్రసాద్ తెలిపారు. మంగళవారం జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా 1-19 సంవత్సరాల పిల్లలందరికి ఆల్బెండజోల్ మాత్రలు మింగించే కార్యక్రమం నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. జిల్లా వ్యాప్తం 1-19 సంవత్సరాల వయస్సున్న పిల్లలు 3,63,888 మంది ఉన్నారని గుర్తించామని తెలియజేశారు. అంగన్వాడీ కేంద్రాలు, పాఠశాల, కళాశాల విద్యార్థులకు మధ్యాహ్నం భోజనం తర్వాత ఆల్బెండజోల్ మాత్రలు మింగించే కార్యక్రమం నిర్వహిస్తున్నామని వివరించారు. ఈ మాత్రలు కారణంగా కడుపులోని నులిపురుగులు నిర్మూలన అవుతుందని, తద్వారా పిల్లలు ఎదుగుదల బాగా ఉంటుందని ఆయన తెలియజేశారు. 17వ తేదీన 95 శాతం మందికి మాత్రలు మింగించాలని, మిగిలిన వారికి 25వ తేదీలోపు పూర్తి చేయాలని తెలిపారు.

పాతపేటలో ఏనుగు హల్‌చల్

కల్లూరు, సెప్టెంబర్ 16: పులిచెర్ల మండలం పాతపేట సమీపంలో ఆదివారం రాత్రి ఒంటరి ఏనుగు హల్‌చల్ చేసింది. ఘీంకారాలతో ప్రజలను భయభ్రాంతులు చేసింది. పాతపాళ్యం అటవీప్రాంతం నుంచి నాలుగు రోజులు క్రితం వచ్చిన నాలుగు ఏనుగుల గుంపు ఇదే ప్రాంతంలో తిష్ట వేసి పంటలను ధ్వంసం చేస్తుండటంతో పంటలకు అపారనష్టం నష్టం వాటిల్లింది. ఆదివారం రాత్రి ఒంటరి ఏనుగు గ్రామం వద్దకు చేరుకొని పంటలను ధ్వంసం చేసింది. గ్రామానికి సమీపంలో వరి, అరటి తదితర పంటలను నాశనం చేసింది. కోతకు వచ్చే సమయంలో రైతు సుబ్రమణ్యంకు చెందిన ఎకరా వరిపంట పాడుచేసింది. కుప్పయ్యకు చెందిన అరటిచెట్లను కూడా ధ్వంసం చేసింది. తమను ప్రభుత్వం ఆదుకోవాలని బాధిత రైతులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.



ధ్వంసమైన వరి, అరటి పంటలు

సచివాలయ సెక్రటరీపై

చేయిచేసుకున్న ట్రాఫిక్ సీఐ!



గాయాలు చూపుతున్న రోహిత్

చిత్తూరు, సెప్టెంబరు 16: సచివాలయ సెక్రటరీపై చిత్తూరు ట్రాఫిక్ సీఐ చేయి చేసుకున్నాడు. బాధితుడి వివరాల మేరకు.. చిత్తూరు నగరానికి చెందిన రోహిత్ తవణంపల్లె మండలం ముట్టుకూరు సచివాలయంలో సెక్రటరీగా విధులు నిర్వహిస్తున్నాడు. సోమవారం సాయంత్రం నగరంలోని గాంధీ విగ్రహం ఎదురుగా ఉన్న చాముండేశ్వరి ఐస్‌క్రీం పార్లర్ ఎదుట తన ద్విచక్ర వాహనాన్ని పార్క్ చేశాడు. తిరిగి వాహనాన్ని తీస్తున్న సమయంలో ట్రాఫిక్ సీఐ వచ్చి వాహనాన్ని త్వరగా తీయాలని చెపుతూ రోహిత్‌పై చేయి చేసుకున్నాడు. తాను సచివాలయ సెక్రటరీనని, వాహనాన్ని తీస్తున్నానని చెబుతున్నా దుర్భాషలాడుతూ కొట్టాడు. ఇదేంటని ప్రశ్నిస్తే పోలీసు జీపులో ఎక్కించి, తప్పుడు కేసులు నమోదుచేసి ఉద్యోగం నుంచి తీసివేస్తానని సీఐ బెదిరించాడు. స్థానికులు అడ్డుకోవడంతో తనను విడిచిపెట్టాడని రోహిత్ వివరించాడు. ఈ విషయంపై ఎస్పీకి ఫిర్యాదు చేస్తానని తెలిపాడు.

కాణిపాకంలో వైభవంగా వేదసభ



ఐరాల(కాణిపాకం), సెప్టెంబరు 16: కాణిపాక వరసిద్ధుడి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల చివరి రోజున సోమవారం రాత్రి కల్యాణ వేదిక వద్ద వేదసభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్రంలోని వివిధ ప్రధాన ఆలయాల నుంచి 40 మంది వేదపండితులు విచ్చేశారు. కార్యక్రమంలో పూతలపట్టు ఎమ్మెల్యే మురళీ మోహన్, ఈవో గురుప్రసాద్, తిరుపతి దేవదాయ శాఖ ఆర్జేసీ ఎస్‌వీవీఎస్ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

వరసిద్ధుడి సేవలో తెలంగాణ న్యాయమూర్తి



జస్టిస్ ఈవీ వేణుగోపాల్‌కు జ్ఞాపికను అందిస్తున్న ఏఈవో విద్యాసాగర్‌రెడ్డి

ఐరాల(కాణిపాకం), సెప్టెంబరు 16: తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఈవీ వేణుగోపాల్ కుటుంబ సమేతంగా సోమవారం కాణిపాక వరసిద్ధుడిని దర్శించుకున్నారు. ఏఈవో విద్యాసాగర్‌రెడ్డి, ఆలయ మర్యాదలతో ఆహ్వానించి స్వామి దర్శన ఏర్పాట్లను పర్యవేక్షించారు. దర్శనానంతరం వేదాశీర్వాద మండపంలో వేదమంత్రాలతో ఆశీర్వదించి స్వామి శేషవస్త్రాలు, తీర్థప్రసాదాలు, జ్ఞాపికను అందించారు. సూపరింటెండెంట్ వాసు, ఆలయ ఇన్‌స్పెక్టర్ రవి, కాణిపాకం ఎస్‌ఐ ధరణీధర్ తదితరులు పాల్గొన్నారు.

త్వరలోనే సమస్యలకు పరిష్కారం: చల్లాబాబు



చల్లాబాబును సత్కరిస్తున్న నాయకులు

రొంపిచెర్ల, సెప్టెంబరు16: సోమల మండలంలోని సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని నియోజకవర్గం టీడీపీ ఇన్‌చార్జి చల్లారామచంద్రారెడ్డి అన్నారు. సోమవారం రొంపిచెర్లలోని ఆయనను సోమల మండల నాయకులు కలిశారు. శాలువతో పూలమాలతో సత్కరించారు. గత ప్రభుత్వంలో ఎదుర్కొన్న సమస్యలు వివరించారు. కొంత కాలం వేచి ఉంటే అన్ని సమస్యలకు పరిష్కారమవుతాయన్నారు. కార్యక్రమంలో శివశంకర్, క్రిష్ణమూర్తి, రాజశేఖర్, మణి, చాణిక్య, మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ కార్యకర్త కుటుంబ సభ్యులకు పరామర్శ



మృతుని కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న పీఎస్‌ఎం తదితరులు

కుప్పం, సెప్టెంబరు 16: నాలుగో వార్డు గుండ్లపల్లెకు చెందిన సీనియర్ కార్యకర్త వెంకటప్ప మనుమడు శేఖర్ ప్రమాదవశాత్తూ సోమవారం వ్యవసాయ బావిలో పడి మృతి చెందాడు. విషయం తెలుసుకున్న నియోజకవర్గ టీడీపీఇన్‌ఛార్జి పీఎస్.మునిరత్నం, క్లస్టర్ ఇన్‌చార్జి ప్రతాప్, నాయకులు సత్యేంద్రశేఖర్, డాక్టర్ వెంకటేశ్ తదితరులు సోమవారం వెళ్లి వెంకటప్ప కుటుంబాన్ని పరామర్శించారు. ధైర్యం చెప్పి పార్టీ తరఫున ఆదుకుంటామని హామీ ఇచ్చారు.

వరద బాధితుల కోసం విరాళాల సేకరణ



రామకుప్పం, సెప్టెంబరు 16: విజయవాడ వరద బాధితులను ఆదుకునేందుకు ప్రతి ఒక్కరూ తమ వంతు సాయాన్ని అందించాలని టీడీపీ నేతలు కోరారు. పార్టీ ఎస్సీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మునస్వామి, బీసీసెల్ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పత్ర నారాయణాచారి, తెలుగురైతు నియోజకవర్గ అధ్యక్షుడు చలపతి, టీడీపీ మండల అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు ఆనందరెడ్డి, నరసింహులు, మాజీ ఎంపీపీ ఆంజినేయరెడ్డి, మాజీ వైస్‌ఎంపీపీ చిన్నికృష్ణల సోమవారం కూటమి పార్టీల శ్రేణులతో కలసి రామకుప్పంలో ప్రజలనుంచి విరాళాలు సేకరించారు. పట్టణ ప్రజలు రూ.52561 అందించారు. కార్యక్రమంలో తెలుగుయువత మండల అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు విశ్వనాథ్, వెంకటాచలం, నేతలు రామ్మూర్తి, గంట్లప్పగౌడు, రామకృష్ణప్ప, కొళ్ళపల్లెబాబు, నందారెడ్డి, మహ్మద్‌రఫీ, మనోహర్, వెంటకరమణ, సత్తి, రామలింగారెడ్డి, బాలరాజు, మంజునాథ్, రఘు, మురళీ, పెరుమాళ్, నవీన్, ఆదిల్, ఆనందరెడ్డి, మణేష్, సురేష్, నరసింహులు, నారాయణస్వామి, వెంకట్రామిరెడ్డి, జనసేన నేతలు హరీష్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

వక్ఫ్‌చట్ట సవరణ బిల్లుకు వైసీపీ వ్యతిరేకం: ఎంపీ మిథున్



పుంగనూరు, సెప్టెంబరు 16: వక్ఫ్ చట్ట సవరణ బిల్లుకు వైసీపీ వ్యతిరేకమని రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి వెంకట మిథున్‌రెడ్డి స్పష్టం చేశారు. పార్లమెంటులో ఈ బిల్లుకు మద్దతు ఇచ్చేదిలేదన్నారు. సోమవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. వక్ఫ్‌బోర్డు చట్ట. సవరణ బిల్లులో సభ్యుడైన ఎంపీ విజయసాయిరెడ్డికి తమ అభ్యంతరాలను తెలియజేశామన్నారు. సీఎం చంద్రబాబునాయుడుతో టీడీపీ నాయకులు మాట్లాడి పుంగనూరులో పెప్పర్ బస్సుల ప్యాక్టరీ ప్రారంభించడానికి సహకరించాలని కోరారు. ఎన్నికల సమయంలోనే రాజకీయాలు చేద్దామని, తర్వాత అభివృద్ధిపై దృష్టి పెట్టాలన్నారు. గతంలో మంజూరైన వాటర్‌గ్రిడ్ ప్రాజెక్టుకు టెండర్లపై టీడీపీ నేతలు సీఎంతో మాట్లాడి పనులు ప్రారంభిస్తే పైపులైన్ ద్వారా నేరుగా గ్రామాలకు తాగునీరు వస్తుందన్నారు. మరో మూడు నెలల్లో శ్రీకాళహస్తి పైపుల ప్యాక్టరీ ప్రారంభమవుతుందన్నారు. మాజీ ఎంపీఎన్.రెడ్డెప్ప, మున్సిపల్ చైర్మన్ ఎస్.అలీంబాషా, వైసీపీ నాయకులు కొండేటి నాగభూషణం, భాస్కర్‌రెడ్డి, వెంకటరెడ్డి యాదవ్, అమ్ము, సలీం, భైరెడ్డిపల్లె కృష్ణమూర్తి, కౌన్సిలర్లు, వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో మునీశ్వర స్వామికి పూజలు



సోమల, సెప్టెంబరు 16: సోమల మండలం కరకమందలో సోమవారం మునీశ్వర స్వామికి భక్తి శ్రద్ధలతో పూజలు చేశారు. ఈ సందర్భంగా గ్రామస్థులు బోణాలను, పూజా సామగ్రిని ఊరేగింపుగా తీసుకెళ్లారు. ఆలయం వద్ద పొంగళ్లు వండి స్వామికి సమర్పించారు. నిర్వాహకులు భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. సోమల, కరకమంద, నడింపల్లె, సూరయ్యగారిపల్లె గ్రామాల భక్తులు దర్శించుకున్నారు.

గ్రామస్థుల వేధింపులపై బాధితుల ఫిర్యాదు

భైరెడ్డిపల్లె, సెప్టెంబరు 16 : కుమ్మరగుంట గ్రామంలో కొందరు గ్రామస్థులు తమను వేధిస్తూ ఇబ్బందులకు గురిచేస్తున్నారని అదే గ్రామానికి చెందిన గంగరాజు, మణి, శంకరప్ప రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. తమ వ్యవసాయ భూమిని కాజేయడానికి ప్రయత్నించారన్నారు. ప్రశ్నించిన తమను నానా అవస్థలకు గురిచేస్తున్నారని వాపోయారు. గ్రామంలో ఎవరూ తమతో మాట్లాడకుండా కట్టడి చేశారన్నారు. సామాజిక బహిష్కరణకు పాల్పడుతున్నారన్నారు. విచారణ జరిపి న్యాయం చేయాలని బాధితులు అధికారులను కోరుతున్నారు. దీనిపై రెవిన్యూ అధికారులు దీనిపై విచారణ జరుపుతున్నారు.

కానిస్టేబుల్ కుటుంబం నుంచి ప్రాణహాని

●పోలీసులకు ఫిర్యాదు చేసిన బాధితులు



మాట్లాడుతున్న గురురాజ, రత్నమ్మ

గంగవరం, సెప్టెంబరు 16 : తమపై దాడి చేసిన కానిస్టేబుల్ కుటుంబంపై నాలుగు రోజుల క్రితం పోలీసులకు ఫిర్యాదు చేసినా న్యాయం జరగలేదని గురురాజా, రత్నమ్మ అనే దంపతులు ఆవేదన వ్యక్తంచేశారు. సోమవారం బాధిత దళిత దంపతులు మాట్లాడుతూ గంగవరం సాయిబాలాజీ వీధి సమీపంలోని తమ ఇంటిపక్కనే పోలీస్ కానిస్టేబుల్ సుబ్రమణ్యంనాయుడు కుటుంబం ఉంటోందన్నారు. ఈనెల 13న ఇంటివద్ద ద్విచక్రవాహనం పార్కింగ్ సందర్భంగా ఏర్పడిన వివాదంలో సుబ్రమణ్యంనాయుడు కుటుంబ సభ్యులు తమపై దాడి చేశారన్నారు. బెంగళూరు నుండి రౌడీలను పిలిపించి చంపించేస్తామని బెదిరిస్తున్నారని ఆరోపించారు. దాడి జరిగిన రోజే గంగవరం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశామన్నారు. కానిస్టేబుల్ కుటుంబం నుంచి తమకు ప్రాణహాని ఉన్నందుక రక్షణ కల్పించి న్యాయం చేయాలని పోలీస్ అధికారులను కోరారు. అర్బన్ సీఐ ప్రసాద్‌ను వివరణ కోరగా ఇరు కుటుంబాలు పరస్పరం ఫిర్యాదు చేసుకున్నాయన్నారు. సామరస్య రాజీకి ప్రయత్నిస్తున్నామన్నారు. వారు రాజీలేదని చెబితే నిబంధనల ప్రకారం కేసు నమోదు చేస్తామన్నారు.

పలమనేరు

కుప్పం/పుంగనూరు

వినాయక లడ్డూ రూ.77వేలు



లడ్డూ దక్కించుకున్న హేమంత్‌కుమార్

పుంగనూరు రూరల్, సెప్టెంబరు16: వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా సోమవారం పట్టణంలో పలుచోట్ల వినాయకుడి నిమజ్జన కార్యక్రమాలు జరిగాయి. తేరువీధి, హైస్కూల్‌వీధి తదితర ప్రాంతాల్లోని ఆలయాల్లో లడ్డూ వేలం వేశారు. హైస్కూల్ వీధిలో విశ్రాంత డీఎస్పీ సుకుమార్ రూ.77.700, తేరువీధిలోని లడ్డూ రాయల పీపుల్స్ ఫింట్ కన్వీనర్ హేమంతుకుమార్ రూ.31వేలకు వీటిని దక్కించుకున్నారు. అనంతరం వినాయకుడి విగ్రహాన్ని మంగళవాయిద్యాల మధ్య పట్టణ సమీపంలోని పాముల కుంటకు తరలించి నిమజ్జనం నిర్వహించారు. భక్తులకు అన్న ప్రసాదాలు అందజేశారు.

అనుమానాస్పద స్థితిలో గుర్తు తెలియని వ్యక్తి మృతి



సదుం, సెప్టెంబరు 16: అనుమానాస్పద స్థితిలో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన సదుంలో ఆలస్యంగా వెలుగు చూసింది. స్థానిక ఎస్ఐ షేక్ షా వలి కథనం మేరకు బట్టువారిపల్లె సమీపంలోని ఆరన్న గారి బావిలో ఓ వ్యక్తి శవం తేలియాడుతున్నట్లు స్థానికులు పోలీసు స్టేషన్‌కు సమాచారం అందించారు. సంబంధిత అమ్మగారిపల్లె వీఆర్వో మహబూబ్ బాషాతో కలిసి సంఘటనా స్థలాన్ని పరిశీలించి మృతదేహాన్ని వెలికి తీసినట్ల ఆయన తెలిపారు. మృతునికి 55-60 ఏళ్ల వయస్సు ఉంటుందన్నారు. ఇతర వివరాలేవీ తెలియరాలేదన్నారు. కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని పీలేరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించామన్నారు. దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన వివరించారు. మృతుని ఆచూకీ గుర్తించిన వారు 9440900701 నంబరకు సమాచారం అందించాలని కోరారు.

ఆరుగురు జూదరుల అరెస్టు

సోమల, సెప్టెంబరు 16: సోమల మండలం పేటూరు పంచాయతీ బోనమంద అటవీ ప్రాంతంలో జూదమాడుతున్న ఆరుగురిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ శివశంకర తెలిపారు. వీరి నుంచి రూ.8వేల నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఆయన పేర్కొన్నారు.

గంగమ్మకు అభిషేక పూజలు

సోమల, సెప్టెంబరు 16: సోమల పంచాయతీ చిన్న సోమల సమీపంలోని బోయకొండ గంగమ్మవారి జాతర సందర్భంగా సోమవారం ఆలయం వద్ద అమ్మవారికి అభిషేక పూజలు నిర్వహించారు. ఆసాదివారు అమ్మవారి జీవిత చరిత్రను గేయ రూపంలో భక్తులకు వివరించారు. పోతురాజ విన్యాసాలు ఆకట్టుకున్నాయి. ఆలయ నిర్వాహకులు కిరణ్, శ్యామల దంపతులను చిన్న సోమల, ముంద్రివారిపల్లె గ్రామస్తులు సన్మానించారు. జాతర ముగియడంతో అమ్మవారి ఉత్సమూర్తికి గంగస్నానం జరిపి చిన్న సోమలలో ఊరేగించారు.

రాష్ట్ర స్థాయి ఖోఖో జట్టుకు లక్ష్మి ఎంపిక



వి.కోట, సెప్టెంబరు 16: వి.కోట మండలం పాముగానిపల్లె ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న లక్ష్మి రాష్ట్ర స్థాయి సబ్ జూనియన్ ఖోఖో జట్టుకు ఎంపికైంది. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రవీంద్రనాథరెడ్డి, పీడీ సురేష్‌లు సోమవారం ఈ విషయం తెలిపారు. ఇటీవల జరిగిన జిల్లా స్థాయి ఖోఖో పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరచినందుకు ఈ బాలికను రాష్ట్ర స్థాయి ఖోఖో జట్టుకు ఎంపిక చేశారు. చిత్తూరు జిల్లా నుంచి ఎంపికైన ఏకైక విద్యార్థిని ఈమె కావడం తమకు గర్వకారణమని హెచ్‌ఎం తెలిపారు. ఈ నెల 28న రాంచీలో జరిగే జాతీయ స్థాయి పోటీలకు ఆంధ్ర తరపున లక్ష్మి ప్రాతినిధ్యం వహించనుంది.

గంజాయి స్వాధీనం: ఒకరి అరెస్టు

భైరెడ్డిపల్లె, సెప్టెంబరు 16 : భైరెడ్డిపల్లె సమీపంలోని చెక్‌పోస్టు ప్రాంతంలో సోమవారం సాయంత్రం గంజాయిని విక్రయిస్తున్న చిరంజీవి అనే వ్యక్తిని పోలీసులు అరెస్టు చేశారు. అతని నుంచి దాదాపు 1200గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. ముందస్తు సమాచారం మేరకు దాడిచేసి పట్టుకుని నిందితుడిని రిమాండుకు తరలించినట్లు చెప్పారు.

నేడు విశ్వకర్మ జయంతి వేడుకలు

చిత్తూరు, సెప్టెంబరు 16: కలెక్టరేట్‌లోని పాత గ్రీవెన్స్ హాలులో మంగళవారం ఉదయం 10.30 గంటలకు విశ్వకర్మ జయంతి వేడుకలను నిర్వహిస్తున్నట్లు బీసీ సంక్షేమాధికారి రబ్బాని బాష ఒకప్రకటనలో తెలిపారు. విశ్వకర్మ చిత్రపటానికి కలెక్టర్ సుమిత్‌కుమార్ పూలమాల వేసి, నివాళి అర్పిస్తారన్నారు.

సిద్ధమవుతున్న న్యాయస్థాన భవనాలు



తుది మెరుగులు దిద్దుకుంటున్న కోర్టు భవన సముదాయం

పలమనేరు, సెప్టెంబరు16 : పలమనేరులో న్యాయస్థాన భవన సముదాయం తుది మెరుగులు దిద్దుకుంటోంది. జూనియర్, సీనియర్ సివిల్ జడ్జిల కోర్టులు, జడ్జిల క్వార్టర్ల భవనాల నిర్మాణం కోసం 2017లో అప్పటి తెలుగుదేశం ప్రభుత్వం రూ.15కోట్లు మంజూరు చేసింది. కాంట్రాక్టరుకు సకాలంలో బిల్లులు చెల్లించక నిర్మాణ పనులు ఆలస్యమయ్యాఇ. ఐదేళ్ల పాటు నిర్మాణ పనులు చేపట్టారు. తాజాగా కోర్టు ఆ నిర్మాణాలు తుది దశకు చేరుకున్నాయి. మరో నెలరోజుల్లో పనులు పూర్తి కానున్నట్లు తెలుస్తోంది. భవనాలు ప్రారంభిస్తే ప్రస్తుత ఇబ్బందులు తొలుగుతాయని ఇక్కడి న్యాయవాదులు అంటున్నారు. ప్రస్తుతం పలమనేరులో సివిల్ జడ్జి కోర్టు సొంత భవనంలో ఉండగా సీనియర్ సివిల్ జడ్జి కోర్టు అద్దె భవనంలో వుంది. జూనియర్ సివిల్ జడ్జికోర్టు పట్టణానికి సుమారు 1.5 కిలోమీటర్ల దూరంలో ఉంది. సీనియర్ సివిల్ జడ్జి కోర్టు పట్టణంలోనే ఉంది. న్యాయవాదులు ఒకే రోజు రెండుకోర్టుల్లో కేసుల వాయిదాకు హాజరు వెళ్లాలంటే ఇబ్బందులు పడుతున్నారు. కక్షిదారులు కూడా న్యాయవాదుల కోసం ఎదురు చూడాల్సి వస్తోంది. కొత్త భవనాలు ప్రారంభమయితే అన్ని కోర్టులు ఒకే ప్రాంగణంలో ఉంటాయి. కక్షిదారులకు, న్యాయవాదులకు,పోలీసులకు సౌకర్యంగా ఉంటుంది. అక్టోబరులో భవనాలను ముఖ్యమంత్రితో ప్రారంభించేందుకు బార్ అసోసియేషన్ ప్రయత్నిస్తున్నట్లు తెలిసింది.

భక్తి శ్రద్ధలతో మిలాద్ ఉన్ నబీ వేడుకలు



పుంగనూరులో ర్యాలీ చేస్తున్న ముస్లింలు



దాదేపల్లెలో ముస్లింల ర్యాలీ

పుంగనూరు రూరల్, సెప్టెంబరు16: మిలాద్ ఉన్ నబి సందర్భంగా ముస్లింలు మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. సోమవారం స్థానిక రాత్రి మసీదు నుంచి ఇందిరాసర్కిల్, ప్రవేటు బస్టాండ్ మీదుగా ఎన్టీఆర్ సర్కిల్ వరకు ర్యాలీ నిర్వహించారు. పండ్లు, మిఠాయిలు పంపిణీ చేశారు. ఈసందర్భంగా పాటలతో యువత నృతాలు చేశారు. అనంతరం అన్నదానం చేశారు. రాత్రి బెంగళూరుకు చెందిన మత గురువులు ప్రార్థనలు చేశారు. బోధనలు వినిపించారు. భారీ స్థాయిలో ముస్లింలు పాల్గొన్నారు.

రొంపిచెర్ల: మతసామరస్యానికి మిలాద్ ఉన్ నబీ పండుగ సారాంశమని రాజంపేట పార్లమెంట్ టీడీపీ నాయకులు షేక్.కరీముల్లా, ఇమ్రాన్‌ఖాన్ అన్నారు. మహమ్మద్ ప్రవక్త పుట్టిన రోజు సందర్భంగా సోమవారం ముస్లింలకు నియోజకవర్గం టీడీపీ ఇన్‌చార్జి చల్లారామచంద్రారెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. **చౌడేపల్లె:** దాదేపల్లెలో మహమ్మద్ ప్రవక్త జన్మదినాన్ని భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. మైనార్టీ మండల అధ్యక్షుడు మహ్మద్ గని, ముస్లిం మత గురువులు, ముస్లింలు పాల్గొన్నారు.

పర్యావరణ హితానికి విద్యార్థుల ప్రతిజ్ఞ



కల్లూరులో అంతర్జాతీయ ఓజోన్ దినోత్సవ ర్యాలీ

కల్లూరు, సెప్టెంబర్16: పర్యావరణాన్ని ప్రతి ఒక్కరూ కాపాడుకుందామని జిల్లా లయన్స్‌క్లబ్ క్రీడావిభాగం అధ్యక్షుడు మహ్మద్ ఆలి, కళాశాల ప్రిన్సిపాల్ సురేష్ అన్నారు. పులిచెర్ల మండలం కల్లూరు వీఆర్ఆర్ డిగ్రీ కళాశాలలో సోమవారం అంతర్జాతీయ ఓజోన్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చెట్లతోనే మానవ మనుగడ సాధ్యమన్నారు. ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధిద్దామన్నారు. ఓజోన్ పొర దెబ్బ తినేలా ఏ కార్యక్రమం చేపట్టబోమని విద్యార్థుల చేత ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కడుపునొప్పి తాళలేక ఆత్మహత్య

విజయపురం, సెప్టెంబరు 16: కడుపునొప్పి తాళలేక ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. చిన్నమహవీరపురానికి చెందిన నాగరాజు(41) కొన్ని నెలలుగా కడుపునొప్పితో బాధపడుతున్నాడు. ఎన్ని ఆస్పత్రులను సంప్రదించినా తగ్గక పోవడంతో ఆదివారం రాత్రి పురుగుల మందు తాగేశాడు. నిద్ర నుంచి మేలుకున్న తల్లి శారద తన కుమారుడు పురుగుల మందు తాగాడని గుర్తించి, చికిత్స నిమిత్తం నగరి ఏరియా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో తిరుపతి రుయాస్పత్రికి తీసుకెళ్లగా, చికిత్స పొందుతూ మృతి చెందారు. తల్లి ఫిర్యాదుతో ఏఎస్ఐ గోవిందరాజులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

నేతమ్స్ కర్మాగారం ఎదుట చెరకు రైతుల ధర్నా



నింద్ర, సెప్టెంబర్ 16: తమకు రావాల్సిన రూ.37కోట్ల బకాయిలు చెల్లించాలని నింద్రలోని నేతమ్స్ షుగర్ కర్మాగారం ఎదుట సోమవారం రైతులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా చెరకు రైతు సంఘ నాయకులు మాట్లాడుతూ.. కర్మాగార యాజమాన్యానికి బ్యాంకు వారు అప్పు ఇవ్వడంతో వారు కర్మాగారాన్ని స్వాధీనం చేసుకున్నట్లు నోటీసు బోర్డులో ప్రకటించారన్నారు. దీనికిగాను తమకు రూ.37 కోట్లు యాజమాన్యం చెల్లించాల్సి ఉందని, అందువల్ల తాము కూడా కర్మాగారాన్ని స్వాధీనం చేసుకున్నట్లు నోటీసు బోర్డు పెట్టామన్నారు. అలాగే వేతన బకాయిలు చెల్లించాల్సి ఉండటంతో రైతులతోపాటు కార్మికులు కూడా ధర్నాలో పాల్గొన్నారు. కార్యక్రమంలో రైతు సంఘ నాయకుడు ఆదినారాయణ పాల్గొన్నారు.

వైసీపీ స్వార్థ రాజకీయాలకు అధికారులు బలి

●చిత్తూరు పార్లమెంటు టీడీపీ అధ్యక్షుడు సీఆర్ రాజన్

గుడిపాల, సెప్టెంబరు 16: వైసీపీ స్వార్థ రాజకీయాలకు అధికారులు బలి అవుతున్నారని చిత్తూరు పార్లమెంటు టీడీపీ అధ్యక్షుడు సీఆర్ రాజన్ అన్నారు. సోమవారం బండపల్లెలో అయన మాట్లాడుతూ.. వైసీపీ ప్రభుత్వంలో నాయకుల కనుసన్నల్లో మెలిగిన అధికారులంతా ఇపుడు సస్పెండ్ అవ్వడం, జైలు పాలు కావడం బాధాకరమన్నారు. ఇక ప్రజలకు స్వచ్ఛమైన పాలన అందించాలనే ఉద్దేశంతోనే సీఎం చంద్రబాబు కూటమి ద్వారా అన్ని చర్యలు చేపడుతున్నారని చెప్పారు. ఇచ్చిన హామీలను కూడా దశలవారీగా నెరవేర్చడానికి చర్యలు చేపడుతున్నారన్నారు. విజయవాడ ప్రజలు వరదలతో అల్లాడుతుంటే మాజీ సీఎం జగన్నాటకాలాడి వెళ్లిపోవడం దారుణమన్నారు. మాజీ జడ్పీటీసీ బాలాజీనాయుడు, టీడీపీ నాయకులు మురళీనాయుడు, పళని గౌండర్, అర్జున్ గౌడ్, ఆనంద్ గౌడ్, ఏకాంబరం యాదవ్, కార్యకర్తలు పాల్గొన్నారు.

నిర్మాణం పూర్తయినా ప్రారంభానికి నిరీక్షణ





పలమనేరు వారపు సంత స్థలంలో నిర్మించిన రైతుబజార్ షెడ్ - రైతుబజార్ గదులు

పలమనేరు, సెప్టెంబరు16 : మార్కెటింగ్ శాఖ ఆధ్వర్యంలో నిర్మించిన రైతు బజార్ ప్రారంభం కోసం ఎదురుచూస్తోంది. 2019లో గత తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో రాష్ట్రవ్యాప్తంగా మార్కెట్ కమిటీ పరిధిలో రైతు బజార్ల నిర్మాణానికి నిదులు మంజూరయ్యాయి. ఐఆర్‌డీఎఫ్ పథకం కింద మంజూరుయిన నిధులతో చాలాచోట్ల రైతు బజార్లను నిర్మించి ప్రారంభించారు. పలమనేరులో మాత్రం రైతు బజార్ ప్రారంభానికి నోచుకోలేదు. నిర్మాణానికి రూ.27లక్షలు ప్రభుత్వం మంజూరు చేసింది. నిర్మాణ పర్యవేక్షణ బాధ్యతను మార్కెటింగ్ శాఖ ఇంజినీర్లు పర్యవేక్షిస్తున్నారు. ఐదేళ్లక్రితం మంజూరైప ఈ రైతు బజార్‌ను స్థానిక వారపు కూరగాయల సంత ప్రదేశంలో నిర్మిస్తే ప్రజలకు సౌకర్యంగా ఉంటుందని అధికారులు బావించారు. మున్సిపాలిటీ ఇందుకు స్థలాన్ని కేటాయించింది. రైతు బజార్ నిర్మాణాన్ని తీసుకొన్న కాంట్రాక్టరు పనులు నత్తనడకన కొనసాగించారు. ఎట్టకేలకు నెల రోజుల క్రితం పూర్తిచేశారు. అంటే నిర్మాణానికి ఐదేళ్ల పట్టింది. అధికారులు దీనిని స్వాధీనం చేసుకుని ఎప్పుడు ప్రారంభిస్తారో అని ప్రజలు నిరీక్షిస్తున్నారు. లక్షలాది రూపాయలు ప్రజాధనంతో నిర్మించిన రైతు బజార్‌ను వెంటనే ప్రారంభించాలని కోరుతున్నారు.

కాశీ విశ్వేశ్వరుడికి అభిషేక పూజలు



కల్లూరు, సెప్టెంబర్ 16: పులిచెర్ల మండలం దేవళంపేటలో కొలువైన కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయంలో సోమవారం అభిషేకం పూజలు నిర్వహించారు. ఉదయం స్వామివారికి అభిషేకాలు, అర్చనలు, విశేషపూజలు నిర్వహించారు. ప్రత్యేక పుష్పాలతో అలంకృతుడైన కాశీవిశ్వేశ్వరస్వామి భక్తులకు దర్శనమిచ్చారు. హోమం నిర్వహించారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

సింగిల్ విండో మాజీ అధ్యక్షుడు శ్రీనివాసులు మృతి



సోమల, సెప్టెంబరు 16: సోమల సింగిల్ విండో మాజీ అధ్యక్షుడు ఎం. శ్రీనివాసులు సోమవారం గుండె పోటుతో మృతి చెందారు. ఆయన భార్య మునిరంగమ్మ సోమల సర్పంచుగా, ఎంపీటీసీగా పనిచేశారు. ఆయన మృతి పట్ల తంబళ్లపల్లె ఎమ్మెల్యే ద్వారకానాథరెడ్డి, పెద్దిరెడ్డి, టీడీపీ, వైసీపీ నాయకులు సంతాపం ప్రకటించారు.

ధ్వజారోహణంతో మహాభారత యజ్ఞానికి శ్రీకారం

సోమల, సెప్టెంబరు 16: సోమల మండలం కందూరులో ధ్వజారోహణంతో మహాభారత యజ్ఞ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. వేదపండితులు పంచపాండవ విగ్రహాలకు అభిషేకపూజలు జరిపారు. ఆలయ ధర్మకర్త శ్రీనివాసులు భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. భాగవతారణి గీతాశ్రీ మహాభారతంలోని ముఖ్య ఘట్టాలను ఆలపించారు.

తిమ్మిరెడ్డిపల్లెలో ఉచిత వైద్యశిబిరం

పూతలపట్టు, సెప్టెంబరు 16: మండలంలోని తిమ్మిరెడ్డిపల్లెలో జడ్పీటీసీ దేవిక కుమార్తె నవ్య జన్మదినం సందర్భంగా సోమవారం ఉచిత వైద్యశిబిరాన్ని నిర్వహించారు. సుమారు వందమందికిపైగా ఉచిత వైద్యసేవలందించి మందులు పంపిణీ చేశారు. ఆర్వీఎస్ ఆస్పత్రి వైద్యాధికారులు, సిబ్బంది, స్థానిక సర్పంచ్ చిట్టెమ్మ, రామమూర్తి తదితరులు పాల్గొన్నారు.

నేడు గిరి ప్రదక్షిణ

చిత్తూరు కల్చరల్, సెప్టెంబరు 16: గిరింపేట వళ్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయ పౌర్ణమి గిరి ప్రదక్షణ మంగళవారం నిర్వహించనున్నట్లు ఈవో సుబ్బారెడ్డి, ఉత్సవ ధర్మకర్త పూల సుబ్రహ్మణ్యం తెలిపారు. స్వామివారికి అభిషేకం, విశేష అలంకారం చేశాక పురవీధుల్లో భక్తులకు దర్శనమివ్వనున్నారు.

ఇసుక ట్రాక్టర్ సీజ్



తవణంపల్లె, సెప్టెంబరు 16: ఎగువమత్యం సమీపంలో మత్యం వంక నుంచి ఎటువంటి అనుమతులు లేకుండా ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టరును ఎస్ఐ చిరంజీవి సీజ్ చేశారు. అనంతరం ట్రాక్టర్‌ను స్థానిక తహసీల్దార్‌కి స్వాధీనం చేయగా.. యజమానికి జరిమానా విధించినట్లు ఎస్ఐ తెలిపారు.

సప్తకన్నికలమ్మ దేవతలకు పూజలు

గంగాధరనెల్లూరు, సెప్టెంబరు 16: ఎల్లమరాజుపల్లె గుట్టలో సప్తకన్నికలమ్మదేవతలకు పూజలను భక్తిశ్రద్ధలతో చేశారు. ఈ పూజలను ఎల్లమరాజుపల్లె గ్రామస్తులతోపాటు పెద్దకాల్వ పంచాయతీకి చెందినవారు సుమారు 30 ఏళ్లుగా నిర్వహిస్తున్నారు. సోమవారం సాయంత్రం ఎల్లమరాజుపల్లెతోపాటు పంచాయతీలోని వివిధ గ్రామాలకు చెందిన మహిళలు పొంగళ్లు తీసుకుని, పంబలవాయిద్యాల నడుమ గ్రామపురవీధుల్లో ఊరేగింపుగా గుట్టపైకి చేరుకున్నారు. మట్టితో తయారుచేసిన 35 జతల ఏనుగులు, గుర్రాలు బొమ్మలకు పసుపు, కుంకుమ బొట్టులుపెట్టి పూలతో అలంకరించి, దేవతలకు సమర్పించారు. పూజల్లో పాల్గొన్న వారికి ప్రసాదాలను పంచిపెట్టారు.

వైసీపీ స్వార్థ రాజకీయాలకు అధికారులు బలి

చిత్తూరు పార్లమెంటు టీడీపీ అధ్యక్షుడు సీఆర్ రాజన్


గుడిపాల టీడీపీ నాయకులతో మాట్లాడుతున్న సీఆర్ రాజన్

గుడిపాల, సెప్టెంబరు 16: వైసీపీ స్వార్థ రాజకీయాలకు అధికారులు బలి అవుతున్నారని చిత్తూరు పార్లమెంటు టీడీపీ అధ్యక్షుడు సీఆర్ రాజన్ అన్నారు. సోమవారం బండపల్లెలో ఆయన మాట్లాడుతూ.. వైసీపీ ప్రభుత్వంలో నాయకుల కనుసన్నల్లో మెలిగిన అధికారులంతా ఇపుడు సస్పెండ్ అవ్వడం, జైలు పాలు కావడం బాధాకరమన్నారు. ఇక ప్రజలకు స్వచ్ఛమైన పాలన అందించాలనే ఉద్దేశంతోనే సీఎం చంద్రబాబు కూటమి ద్వారా అన్ని చర్యలు చేపడుతున్నారని చెప్పారు. ఇచ్చిన హామీలను కూడా దశలవారీగా నెరవేర్చడానికి చర్యలు చేపడుతున్నారన్నారు. విజయవాడ ప్రజలు వరదలతో అల్లాడుతుంటే మాజీ సీఎం జగన్నాటకాలాడి వెళ్లిపోవడం దారుణమన్నారు. మాజీ జడ్పీటీసీ బాలాజీనాయుడు, టీడీపీ నాయకులు మురళీనాయుడు, పళని గౌండర్, అర్జున్ గౌడ్, ఆనంద్ గౌడ్, ఏకాంబరం యాదవ్, కార్యకర్తలు పాల్గొన్నారు.

జెత్వానీ కేసులో అసలు సూత్రధారి సజ్జల: టీడీపీ


మీడియాతో మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

చిత్తూరు సిటీ, సెప్టెంబరు 16: ముంబై సినీనటి జెత్వానీ కేసులో అసలు సూత్రధారి మాజీ సీఎం జగన్ రెడ్డి ముఖ్య సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి అని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి సప్తగిరి ప్రసాద్, చిత్తూరు పార్లమెంటు ప్రధాన కార్యదర్శి కోదండయాదవ్ ఆరోపించారు. సోమవారం జిల్లా పార్టీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. సజ్జల ఆదేశాల మేరకే పోలీస్ అధికారులు సీఎస్ఆర్ ఆంజనేయులు, కాంతి రాణా టాటా, విశాల్ గుని అత్యుత్సాహంతో వెళ్లి నిబంధనలకు విరుద్ధంగా జెత్వానీని అరెస్టు చేసి, చిత్రహింసలకు గురిచేశారని చెప్పారు. ఆ అధికారుల ఇప్పుడు సస్పెండై తగిన మూల్యం అనుభవిస్తున్నారని, వారికి తీరని అవమానం జరిగిందన్నారు. ఈ కేసులో లోతైన విచారణ జరిపి అసలు దోషులను అరెస్టుచేసి కఠినంగా శిక్షించాలని కోరారు. నేతలు కృష్ణమూర్తి, మధుయాదవ్, వినోద్ కుమార్, జైపాల్ తదితరులు పాల్గొన్నారు.

పైప్‌లైన్ పనులకు భూమి పూజ



పాలసముద్రం, సెప్టెంబరు 16: ఎస్ఆర్ఆర్ కండ్రిగలో కొత్తగా నిర్మించిన హౌసింగ్ కాలనీ తాగునీటి సమస్య తీర్చడానికి ప్రభుత్వం నిధులు మంజూరు చేయడంతో సోమవారం పైప్‌లైన్ పనుల కోసం టీడీపీ నాయకులు భూమిపూజ చేశారు. టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి శేఖర్‌రాజు, నాయకులు ఏలుమలై, నవీన్‌చౌదరి, ఈసీ మెంబర్ జయరాజ్, కాంట్రాక్టర్ నవీన్ పాల్గొన్నారు.

ఎస్ఐకి సత్కారం



వెదురుకుప్పం, సెప్టెంబరు 16: వెదురుకుప్పం ఎస్ఐ వెంకటసుబ్బయ్యను సోమవారం తెలుగుదేశం, జనసేన పార్టీ నాయకులు కలసి శాలువ కప్పి సత్కారం చేశారు. టీఎస్‌టీయూసీ జీడీనెల్లూరు నియోజకవర్గ ఉపాధ్యక్షుడు పోటుగారి గంగయ్య, టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జి పి.మోహన్‌మురళి, జనసేన యువజన మండల అధ్యక్షుడు కావలి సతీష్ పాల్గొన్నారు.

కొండ మల్లీశ్వరుడికి క్షీరాభిషేకం



వెదురుకుప్పం, సెప్టెంబరు 16: డీఆర్ఎన్‌కండ్రిగ సమీపంలోని అరుణగిరి క్షేత్రంలో ఉన్న జ్ఞాన ప్రసూనాంబ కొండమల్లీశ్వరస్వామికి, చవటగుంటలోని ఆవుదేవర నందీశ్వరుడికి సోమవారం క్షీరాభిషేకం చేశారు. ప్రత్యేక పూజలు నిర్వహించి, భక్తులకు అన్నదానం చేశారు.

తిమ్మిరెడ్డిపల్లెలో ఉచిత వైద్యశిబిరం

పూతలపట్టు, సెప్టెంబరు 16: మండలంలోని తిమ్మిరెడ్డిపల్లెలో జడ్పీటీసీ దేవిక కుమార్తె నవ్య జన్మదినం సందర్భంగా సోమవారం ఉచిత వైద్యశిబిరాన్ని నిర్వహించారు. సుమారు వందమందికిపైగా ఉచిత వైద్యసేవలందించి మందులు పంపిణీ చేశారు. ఆర్వీఎస్ ఆస్పత్రి వైద్యాధికారులు, సిబ్బంది, స్థానిక సర్పంచ్ చిట్టెమ్మ, రామమూర్తి తదితరులు పాల్గొన్నారు.

క్షేత్రస్థాయిలో పార్టీ బలోపేతమే లక్ష్యం: జనసేన


సమావేశంలో ప్రసంగిస్తున్న యుగంధర్

వెదురుకుప్పం, సెప్టెంబరు 16: క్షేత్రస్థాయిలో పార్టీని బలోపేతం చేయడమే లక్ష్యమని జీడీ నెల్లూరు జనసేన ఇన్‌చార్జి యుగంధర్ అన్నారు. సోమవారం వెదురుకుప్పంలో పార్టీ మండల అధ్యక్షుడు పురుషోత్తం అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన ప్రసంగించారు. పార్టీ కోసం కష్టపడిన ప్రతి ఒకరికీ సముచిత స్థానం ఉంటుందన్నారు. 30 శాతం నామినేటెడ్ పదవులు జనసేనకే ఇవ్వడం జరుగుతుందని చెప్పారు.

నేడు గిరి ప్రదక్షిణ

చిత్తూరు కల్చరల్, సెప్టెంబరు 16: గిరింపేట వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయ పౌర్ణమి గిరి ప్రదక్షిణ మంగళవారం నిర్వహించనున్నట్లు ఈవో సుబ్బారెడ్డి, ఉత్సవ ధర్మకర్త పూల సుబ్రహ్మణ్యం తెలిపారు. స్వామివారికి అభిషేకం, విశేష అలంకారం చేశాక పురవీధుల్లో భక్తులకు దర్శనమివ్వనున్నారు.

రేపటినుంచి మహాలయ పక్షమాసం

చిత్తూరు కల్చరల్, సెప్టెంబరు 16: గిరింపేట సుగుణేంద్రతీర్థ మూల సన్నిధానంలో బుధవారం నుంచి అక్టోబరు రెండో తేదీవరకు మహాలయ పక్షమాసం నిర్వహించనున్నారు. స్వర్గస్తులైన పితృదేవతలకు, కుటుంబ సభ్యులకు, ఈ మాసంలో శ్రాద్ధకర్మలు నిర్వహించుకోవచ్చని సోమవారం నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు మూల బృందావనంలో అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. వివరాలకై 77994 46647 నెంబరును సంప్రదించాలని సూచించారు.

ఇసుక ట్రాక్టర్ సీజ్



తవణంపల్లె, సెప్టెంబరు 16: ఎగువమత్యం సమీపంలో మత్యం వంక నుంచి ఎటువంటి అనుమతులు లేకుండా ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టరును ఎస్ఐ చిరంజీవి సీజ్ చేశారు. అనంతరం ట్రాక్టర్‌ను స్థానిక తహసీల్దార్‌కి స్వాధీనం చేయగా.. యజమానికి జరిమానా విధించినట్లు ఎస్ఐ తెలిపారు.

బాల్‌బ్యాడ్మింటన్‌లో చిత్తూరు ప్రతిభ


ట్రోఫీ అందుకుంటున్న క్రీడాకారులు

నగరి, సెప్టెంబరు 16: కాకినాడ జిల్లా అన్నవరంలో ఈనెల 13, 14, 15 తేదీల్లో జరిగిన 9వ సబ్ జూనియర్ అంతర్రాష్ట్ర బాల్ బ్యాడ్మింటన్ పోటీల్లో ఉమ్మడి చిత్తూరు జిల్లా జట్టు ప్రథమ స్థానంలో నిలిచింది. అలాగే జాతీయస్థాయి పోటీలకు బాలుర జట్టు నుంచి కేసీ తేజేష్(నగరి), బీసీ హేమచరణ్(శ్రీకాళహస్తి), బాలికల జట్టు నుంచి ప్రశాంతి(శ్రీకాళహస్తి) ఎంపికైనట్లు ఉమ్మడి చిత్తూరు జిల్లా బాల్‌బ్యాడ్మింటన్ అసోషియేషన్ ఛైర్మన్ జగన్నాథనాయుడు, అధ్యక్షుడు వెంకటస్వామి తెలిపారు. నగరికి చెందిన కేసీతేజేష్.. స్టార్ ఆఫ్ ఆంధ్రాగాను, లక్ష్మీనారాయణ.. బెస్ట్ ఆఫ్ కమింగ్ ప్లేయర్‌గాను అవార్డు అందుకున్నారు. ప్రతిభచూపిన క్రీడాకారులను అసోసియేషన్ కార్యదర్శి బాలాజి, కోచ్‌లు గోపి, జయచంద్ర, మేనేజర్లు సుజాత, చంద్రశేఖర్, చెంచురత్నం, మునికృష్ణ నరేష్ అభినందించారు.


యాగశాలలో పూర్ణాహుతి




సిద్ధి, బుద్ధి సమేత వరసిద్ధుడికి గ్రామోత్సవం.. వసంతోత్సవంలో భాగంగా రంగులు పూసుకుంటూ.. పుష్కరిణిలో త్రిశూలానికి క్షీరాభిషేకం

ఏకాంత సేవలో వరసిద్ధుడికి విశేష హారతులు

ఐరాల(కాణిపాకం), సెప్టెంబరు 16: కాణిపాకం వరసిద్ధుడి ఆలయ బ్రహ్మోత్సవాల చివరి రోజున ఉత్సవర్లకు విశేష హారతులను ఇస్తారు. ఇందులో సోమవారం రాత్రి స్వామికి ఏక, నక్షత్ర, రథ, కుంభ, పంచ హారతితోపాటు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ హారతులు విశేషమైన రోజున మాత్రం స్వామికి ఇస్తారు. అలాగే ప్రతి రోజూ ఆలయంలో హారతి సమయంలో వీటితోనే మూల విరాట్‌కు హారతి ఇస్తారు. ఈ హారతి సేవలో పాల్గొనడానికి భక్తులు చాలా ఇష్టపడతారు.


ఆస్థాన మండపంలో నృత్య ప్రదర్శన

స్వామిని దర్శించుకున్న ప్రముఖులు

ఐరాల(కాణిపాకం), సెప్టెంబరు 16: స్వయంభు కాణిపాక వరసిద్ధుడిని సోమవారం సాయంత్రం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వీరిలో.. కైకలూరు ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్, ఆలయ పునర్ నిర్మాణదాత గుత్తికొండ శ్రీనివాస్, గొట్టిపాటి రామకృష్ణ, ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ ఉన్నారు. వీరందరినీ ఎమ్మెల్యే మురళీమోహన్, ఈవో గురుప్రసాద్‌లు ఆలయ మర్యాదలతో ఆహ్వానించి స్వామి దర్శన ఏర్పాట్లను పర్యవేక్షించారు. దర్శనానంతరం వేదాశీర్వాద మండపంలో వేదమంత్రాలతో ఆశీర్వదించి.. స్వామి శేషవస్త్రాలు, తీర్థప్రసాదాలు అందించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ శాంతిసాగర్‌రెడ్డి, ఆలయ మాజీ ఛైర్మన్లు మణినాయుడు, మోహన్‌రెడ్డి, మాజీ ఎంపీ దుర్గారామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.


కామినేని శ్రీనివాస్, గుత్తికొండ శ్రీనివాసరావు, గొట్టిపాటి రామకృష్ణకు ప్రసాదం అందిస్తున్న ఎమ్మెల్యే మురళీమోహన్

భక్తి ప్రపత్తులతో మిలాద్ ఉన్ నబీ


నగరంలో మహమ్మద్ ప్రవక్త కేశాలను ఊరేగిస్తున్న ముస్లింలు

చిత్తూరు కల్చరల్, సెప్టెంబరు 16: మిలాద్ ఉన్ నబీ (మహమ్మద్ ప్రవక్త జయంతి) పండగను సోమవారం ముస్లింలు భక్తి ప్రపత్తులతో నిర్వహించారు. నగరంలోని అన్ని మసీదుల్లో ప్రార్థనలు చేశారు. బజారువీధి చిన్న మసీదులో భద్రపరిచిన మహమ్మద్ ప్రవక్త కేశాలను మేళతాళలతో చర్చివీధి, ప్రభుత్వ ఆస్పత్రి, గంగనపల్లె, దర్గా, పలమనేరు రోడ్డు, హైరోడ్డు, గాంధీ చౌక్, శేషాపిరాన్ వీధుల్లో ఊరేగింపుగా తీసుకొచ్చి అసార్ వీధి మసీదులో భక్తుల సందర్శనార్థం ఉంచారు. సోమవారం పురుషులు, మంగళవారం ముస్లిం మహిళలు ప్రవక్త కేశాలను దర్శించుకోనున్నారు. ఈ కార్యక్రమాల్లో ప్రభుత్వ ఖాజీ కమాలుల్లా జునైది జుహారితోపాటు అధిక సంఖ్యలో ముస్లింలు పాల్గొన్నారు.

టీడీపీ గూటికి చేరిన వైసీపీ యువజన నేత


హరీష్‌యాదవ్‌కి టీడీపీ కండువా కప్పిన ఎమ్మెల్యే థామస్

వెదురుకుప్పం, సెప్టెంబరు 16: వైసీపీ రాష్ట్ర యువజన జాయింట్ సెక్రటరీ వి.హరీష్‌యాదవ్ ఆ పార్టీకి రాజీనామా చేశారు. గంగాధర నెల్లూరు మండలం ఎట్టేరి గ్రామానికి చెందిన ఈయన ఆ పార్టీలో కీలకంగా పనిచేశారు. సోమవారం రాత్రి రాజీనామా చేసి, చెన్నైలో జీడీనెల్లూరు ఎమ్మెల్యే థామస్ సమక్షంలో తెలుగుదేశం పార్టీలో చేరారు. ఆయనవెంట గంగాధరనెల్లూరు టీడీపీ మండలాధ్యక్షుడు స్వామిదాస్, మహిళా నాయకురాలు ఇందిర, వెదురుకుప్పం టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జి పి.మోహన్‌మురళి, నియోజకవర్గ యువత ఉపాధ్యక్షుడు బోడిరెడ్డి సుధాకర్‌రెడ్డి, సాంస్కృతిక విభాగం రాష్ట్ర ప్రధానకార్యదర్శి నేసనూరు మునిచంద్రారెడ్డి తదితరులు ఉన్నారు.

నడిచొచ్చే శ్రీవారి భక్తులకు రోజూ అన్నదానం


కరపత్రాలు ప్రదర్శిస్తున్న సభ్యులు

చిత్తూరు సిటీ, సెప్టెంబరు 16: తిరుమల శ్రీవారి దర్శనానికి నడిచి వెళ్లే భక్తులకు రోజూ అన్నదానం చేయనున్నట్లు ఓం నమో వేంకటేశాయ శ్రీతరిగొండ వెంగమాంబ అన్నదానం ట్రస్ట్ సభ్యులు చెప్పారు. సోమవారం ప్రెస్‌క్లబ్‌లో వారు మీడియాతో మాట్లాడుతూ.. పెరటాసి నెలను పురస్కరించుకుని తమిళనాడు, కర్ణాటక నుంచి చిత్తూరు మీదుగా కాలినడకన వెళ్లే శ్రీవారి భక్తులకు నెలపాటు అన్నదానం, వసతి ఏర్పాటు చేయనున్నామన్నారు. మంగళవారం నుంచి అక్టోబరు 16వ తేదీవరకు కట్టమంచిలోని శాంతా రఘురామన్ కళ్యాణ మండపంలో భక్తులకు అన్ని ఏర్పాట్లూ చేశామన్నారు. ఈ కార్యక్రమానికి విరాళాలు ఇవ్వాలనుకుంటే 94408 23750, 90302 04205 నెంబరను సంప్రదించాలన్నారు.

నేడు విశ్వకర్మ జయంతి వేడుకలు

చిత్తూరు, సెప్టెంబరు 16: కలెక్టరేట్‌లోని పాత గ్రీవెన్స్ హాలులో మంగళవారం ఉదయం 10.30 గంటలకు విశ్వకర్మ జయంతి వేడుకలను నిర్వహిస్తున్నట్లు బీసీ సంక్షేమాధికారి రబ్బాని బాష ఒకప్రకటనలో తెలిపారు. విశ్వకర్మ చిత్రపటానికి కలెక్టర్ సుమిత్‌కుమార్ పూలమాల వేసి, నివాళి అర్పిస్తారన్నారు. అన్ని విభాగాల అధికారులు, సంఘ నేతలు పాల్గొనాలని ఆయన కోరారు.

వైభవంగా 'గణేష్' నిమజ్జనం


గణేశుడి ప్రతిమను నిమజ్జనానికి తీసుకెళుతున్న పల్లెవీధివాసులు

బంగారుపాళ్యం, సెప్టెంబరు 16: మండలంలోని బంగారుపాళ్యం మేజర్ పంచాయతీ పల్లెవీధికి చెందిన యువకులు ఏర్పాటు చేసిన వినాయకుడి ప్రతిమను సోమవారం బాణాసంచా వేడుకలు, మంగళ వాయిద్యాలు, బ్యాండు మేళాల మధ్య యువకులు నృత్యాలు చేస్తూ వెంకటప్పనాయని చెరువులో నిమజ్జనం చేశారు.

వెదురుకుప్పం: సీఆర్‌కండ్రిగ కాలనీలో వినాయక చవితి సంబరాలను పురస్కరించుకుని సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు.

గుజ్జు తయారీలో నాణ్యత ప్రమాణాలు పాటించాలి

రాష్ట్ర ఉద్యానశాఖ డైరెక్టర్


వివరాలు తెలుసుకుంటున్న శ్రీనివాసులు

చిత్తూరు (సెంట్రల్), సెప్టెంబరు 16: గుజ్జు తయారీలో ఫ్యాక్టరీలు నాణ్యత ప్రమాణాలు పాటించాలని రాష్ట్ర ఉద్యానశాఖ డైరెక్టర్ కె.శ్రీనివాసులు సూచించారు. జిల్లా పర్యటనలో భాగంగా సోమవారం గంగాధరనెల్లూరులోని జైన్, పూతలపట్టులోని గల్లా ఫుడ్స్ ఫ్యాక్టరీలను పరిశీలించారు. మామిడి పండ్ల సేకరణలో నాణ్యత, గుజ్జు తయారీ, సామర్థ్యం, చేపడుతున్న నాణ్యత పరీక్షలు, ప్యాకింగ్ తీరు, మార్కెటింగ్ తదితర అంశాలను క్షుణ్ణంగా తెలుసుకున్నారు. ఆయనవెంట జిల్లా ఉద్యానాధికారి మధుసూదనరెడ్డి, డీడీహెచ్ శ్రీకాంత్‌రెడ్డి, ఏడీలు, ఫ్యాక్టరీల ప్రతినిధులున్నారు.

ఎండిపోతున్న వేరుశనగ పంట



శ్రీరంగరాజపురం, సెప్టెంబరు 16: మండలంలోని వేరుశనగ పంట తీవ్ర వర్షాభావం కారణంగా ఎండిపోతోంది. దీంతో రైతులు పెట్టిన పెట్టుబడులు కూడ రాని పరిస్థితి నెలకొంది. మండలవ్యాప్తంగా ఖరీఫ్ సీజన్‌లో దాదాపు 320 ఎకరాల్లో వేరుశనగ సాగు చేశారు. జూన్, జూలై నెలల్లో వర్షాలు ఓ మోతాదులో కురిశాయి. ఆగస్టు మొదటి వారం నుంచి పూత, వేరు మొలకెత్తే దశలో వానలు కురవక, నీరందక పంట పూర్తిగా ఎండిపోయే దశలో ఉంది. ప్రభుత్వం స్పందించి రెయిన్‌గన్లు అందజేసి.. పంటలను కాపాడాలని రైతులు కోరుతున్నారు.

రోజాకు సన్మానం

నగరి, సెప్టెంబరు 16: వైసీపీ అధికార ప్రతినిధిగా నియమితులైన మాజీ మంత్రి ఆర్కే రోజాను సోమవారం నగరిలో సన్మానించారు. జగన్ తనపై ఉంచిన బాధ్యతను సక్రమంగా నెరవేరుస్తానని రోజా పేర్కొన్నారు. మున్సిపల్ ఛైర్మన్ నీలమేఘం, వైస్ ఛైర్మన్ బాలన్, కౌన్సిలర్లు దయానిధి, బిడాభాస్కర్, గోపాల్‌రెడ్డి గాంధీ, కన్నెప్పన్ తదితరులు పాల్గొన్నారు.

బస్సు సర్వీసుల రద్దుతో జనానికి తిప్పలు

వెదురుకుప్పం, సెప్టెంబరు 16: బస్సు సర్వీసులను రద్దు చేయడంతో జనానికి తిప్పలు తప్పడం లేదు. చిత్తూరు రెండో డిపో నుంచి పెనుమూరు మీదుగా వెదురుకుప్పం, పుత్తూరుకు రెండు సర్వీసులు ఉండేవి. వీటిని చాలా ఏళ్ల క్రితం నిలిపివేశారు. అలాగే చిత్తూరు నుంచి కార్వేటినగరం వరకు ఉన్న సర్వీసు, చిత్తూరు-పెనుమూరు మీదుగా పులికల్లు పచ్చికాపల్లం సర్వీసు ఆపేశారు. వీటితోపాటు రద్దయిన వాటిలో.. చిత్తూరు నుంచి గంగమ్మ గుడి మీదుగా ఆళ్లమడుగు వైపు నుంచి తిరుపతి వెళ్లే సర్వీసు ● పుత్తూరు డిపోకు చెందిన కార్వేటినగరం-పెనుమూరు షటిల్ ● తిరుపతి డిపోకు చెందిన తిరుపతి నుంచి పెనుమూరు షటిల్ సర్వీసులు ● చంద్రగిరి-కార్వేటినగరం సర్వీసులు ● పుత్తూరు డిపో నుంచి పెనుమూరు వెళ్లే సర్వీసులు ● పుత్తూరు డిపోకు చెందిన అగ్గిచేనుపల్లె, నచ్చుకూరు సర్వీసులు ● చిత్తూరు రెండో డిపోకు చెందిన చిత్తూరు నుంచి తిరుపతికి వెళ్లి అక్కడినుంచి వెదురుకుప్పం మీదుగా చిత్తూరు-బెంగళూరుకు వెళ్లే సర్వీసులు ఉన్నాయి. ఇలానే మరికొన్ని సర్వీసులనూ నిలిపేయడంతో గ్రామీణులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.



పొంగళ్లను తీసుకొస్తున్న మహిళలు - సప్తకన్నికలమ్మ దేవతలకు పూజలు నిర్వహిస్తున్న భక్తులు

సప్తకన్నికలమ్మ దేవతలకు పూజలు

గంగాధరనెల్లూరు, సెప్టెంబరు 16: ఎల్లమరాజుపల్లె గుట్టలో సప్తకన్నికలమ్మదేవతలకు పూజలను భక్తిశ్రద్ధలతో చేశారు. ఈ పూజలను ఎల్లమరాజుపల్లె గ్రామస్తులతోపాటు పెద్దకాల్వ పంచాయతీకి చెందినవారు సుమారు 30 ఏళ్లుగా నిర్వహిస్తున్నారు. సోమవారం సాయంత్రం ఎల్లమరాజుపల్లెతోపాటు పంచాయతీలోని వివిధ గ్రామాలకు చెందిన మహిళలు పొంగళ్లు తీసుకుని, పంబలవాయిద్యాల నడుమ గ్రామపురవీధుల్లో ఊరేగింపుగా గుట్టపైకి చేరుకున్నారు. మట్టితో తయారుచేసిన 35 జతల ఏనుగులు, గుర్రాలు బొమ్మలకు పసుపు, కుంకుమ బొట్టులుపెట్టి పూలతో అలంకరించి, దేవతలకు సమర్పించారు. ఈసందర్భంగా పూజల్లో పాల్గొన్న వారికి ప్రసాదాలను పంచిపెట్టారు.

బకాయిలు చెల్లించండి

నేతమ్స్ కర్మాగారం ఎదుట చెరకు రైతుల ధర్నా



ధర్నా నిర్వహిస్తున్న రైతు సంఘ నాయకులు, రైతులు పెట్టిన బోర్డు

నింద్ర, సెప్టెంబరు 16: తమకు రావాల్సిన రూ.37కోట్ల బకాయిలు చెల్లించాలని నింద్రలోని నేతమ్స్ షుగర్ కర్మాగారం ఎదుట సోమవారం రైతులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా చెరకు రైతు సంఘ నాయకులు మాట్లాడుతూ.. కర్మాగార యాజమాన్యానికి బ్యాంకు వారు అప్పు ఇవ్వడంతో వారు కర్మాగారాన్ని స్వాధీనం చేసుకున్నట్లు నోటీసు బోర్డులో ప్రకటించారన్నారు. దీనికిగాను తమకు రూ.37 కోట్లు యాజమాన్యం చెల్లించాల్సి ఉందని, అందువల్ల తాము కూడా కర్మాగారాన్ని స్వాధీనం చేసుకున్నట్లు నోటీసు బోర్డు పెట్టామన్నారు. అలాగే వేతన బకాయిలు చెల్లించాల్సి ఉండటంతో రైతులతోపాటు కార్మికులు కూడా ధర్నాలో పాల్గొన్నారు. కార్యక్రమంలో రైతు సంఘ నాయకుడు ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ



గుడిపాల, సెప్టెంబరు 16: మండలంలోని క్రిష్ణజిమ్మాపురం పంచాయతీ అత్తిగారిగుట్టలో వెలసిన కాశీ లింగేశ్వరస్వామి దేవస్థానంలో దాతల సహకారంతో సోమవారం ఆంజనేయస్వామి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. పురోహితులు మహేశ్ శర్మ, సుదర్శన్ అయ్యంగార్, నిర్వాహకుడు కిరణ్‌కుమార్ ఆధ్వర్యంలో మహా కుంభాభిషేకాన్ని నిర్వహించారు. మధ్యాహ్నం అన్నదానం చేశారు. మండలంలోని పలు గ్రామాల నుంచి వందలాది భక్తులు తరలివచ్చారు. చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ తండ్రిచెన్నకేశవులు నాయుడు, ఆయన సోదరుడు జగ్జీవన్‌లను ఆలయ నిర్వాహకులు ఆహ్వానించి, స్వామివారి జ్ఞాపికలను అందజేశారు. మాజీ సర్పంచ్ ప్రతాప్ నాయుడు, నాయకులు మురారి సుధాకర్, జగదీశ్వర్ నాయుడు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

జర్నలిస్టుల సంక్షేమానికి కృషి చేస్తా

ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు

చిత్తూరు సిటీ, సెప్టెంబరు 16: జర్నలిస్టుల సంక్షేమానికి కృషి చేస్తానని ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు చెప్పారు. ఏపీయూడబ్ల్యూజే చిత్తూరు జిల్లా కార్యవర్గం, చిత్తూరు ప్రెస్‌క్లబ్ కమిటీ సోమవారం ఎంపీని మర్యాదపూర్వకంగా కలిశారు. ఇంటి పట్టాలు, హెల్త్ కార్డులు, రైల్వే పాసుల మంజూరుకు సంబంధించి పలు సమస్యలను జర్నలిస్టులు ఎంపీ దృష్టికి తీసుకెళ్లారు. ఏపీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షుడు లోకనాథం, కార్యదర్శి మురళి, కార్యనిర్వాహక కార్యదర్శి అశోక్, చిత్తూరు ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు రమేష్ బాబు, ప్రధాన కార్యదర్శి కాళేశ్వర్ రెడ్డి పాల్గొన్నారు.

కడుపునొప్పి తాళలేక ఆత్మహత్య

విజయపురం, సెప్టెంబరు 16: కడుపునొప్పి తాళలేక ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. చిన్నమహావీరపురానికి చెందిన నాగరాజు(41) కొన్ని నెలలుగా కడుపునొప్పితో బాధపడుతున్నాడు. ఎన్ని ఆస్పత్రులను సంప్రదించినా తగ్గక పోవడంతో ఆదివారం రాత్రి పురుగుల మందు తాగేశాడు. నిద్ర నుంచి మేలుకున్న తల్లి శారద తన కుమారుడు పురుగుల మందు తాగాడని గుర్తించి, చికిత్స నిమిత్తం నగరి ఏరియా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో తిరుపతి రుయాస్పత్రికి తీసుకెళ్లగా, చికిత్స పొందుతూ మృతి చెందారు. తల్లి ఫిర్యాదుతో ఏఎస్ఐ గోవిందరాజులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ముగిసిన క్రైస్తవ కూటములు

గుడిపాల, సెప్టెంబరు 16: ఈస్టర్ కొండపై వెలసిన సీఎస్ఐ చర్చిలో రెండ్రోజులుగా నిర్వహించిన క్రైస్తవ కూటములు సోమవారం ముగిశాయి. ఈ కూటములకు ముఖ్య అతిథిగా సీఎస్ఐ వేలూరు డయాసిస్ బిషప్ డాక్టర్ శర్మ నిత్యానందం పాల్గొని భక్తులకు జ్ఞానబోధ చేశారు. వేలూరు ఊరీస్ కాలేజ్ ప్రొఫెసర్ అన్బళగన్, చర్చి సెక్రటరీ ఎం.రూబన్, ఆర్.రమేష్, వి.సెల్వం, మోహన్ సామువేల్, పంజపాడి తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ జిల్లా కార్యదర్శికి పరామర్శ


బాలాజీని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే భానుప్రకాష్

నగరి, సెప్టెంబరు 16: ఉమ్మడి జిల్లా టీడీపీ కార్యదర్శి రుక్కుం బాలాజీని నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ సోమవారం పరామర్శించారు. నాలుగు రోజుల క్రితం అనారోగ్యంతో ఆపరేషన్ చేసుకున్న ఆయన్ను స్వగృహంలో కలిశారు. ఎమ్మెల్యేవెంట బాబురెడ్డి, హరిహరన్, తదితరులున్నారు.

సమాజంపై బాధ్యత పెంచుకోవాలి

విద్యార్థులకు ఎమ్మెల్సీ కంచర్ల సూచన


సమావేశంలో ప్రసంగిస్తున్న కంచర్ల శ్రీకాంత్

చిత్తూరు (సెంట్రల్), సెప్టెంబరు 16: విద్యార్థులు కేవలం సమాజంపై బాధ్యత పెంచుకోవాలని ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ సూచించారు. విజయం డిగ్రీ కళాశాల 21వ వార్షికోత్సవం సోమవారం ఓ ఫంక్షన్ హాలులో విద్యాసంస్థల అధినేత తేజోమూర్తి, అకడమిక్ డైరెక్టర్ శైలజమూర్తి ఆధ్వర్యంలో నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్సీ ప్రసంగించారు. రచయిత, వ్యక్తిత్వ వికాస నిపుణుడు ఆకెళ్ళ రాఘవేంద్ర మాట్లాడుతూ తల్లిదండ్రుల ఆకాంక్షలను నెరవేర్చి ఉన్నత స్థాయికి ఎదగాలన్నారు. అనంతరం ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు, జ్ఞాపికలను అందజేశారు. అధ్యాపకులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.